## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# నిరంతర వార్తా ప్రవాహం జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:05 | సంచిక:37 | శనివారం అక్టోబర్ 24, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00


# తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

**మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశం.. డిండి, అచ్చంపేటకు అదనపు నీటి కేటాయింపులు**



రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులు, నిర్మాణ ప్రతిపాదనలపై కీలక చర్చలు జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2లో▸

## సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి:




**అరుణాచల్ సరిహద్దులో భారత్--చైనా ఘర్షణలు!**
**ఘర్షణలు కొనసాగుతున్నట్లు ఐటీబీపీ డీజీ వెల్లడి.**
**గల్వాన్ తరహా పోరుకు ప్రత్యేక శిక్షణ.**
**కేంద్రం సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్ డిమాండ్.**

చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘర్షణలను ధ్రువీకరిస్తూ వెలువడిన తొలి ప్రకటన ఇదే కావడం గమనార్హం. "అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

2లో▸

## నవంబర్ 3 నుంచి ఇండో--పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

ఢిల్లీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న భారత నౌకాదళం
శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారంపై 18 దేశాల నిపుణుల చర్చలు

2లో▸




## దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

**పోలీసు శాఖల్లో సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర సంస్కరణలతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి**

దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సంస్కరణలు తీసుకురావాలని, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ (ాాజజ) సమావేశాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.



2లో▸

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీకి వర్ష సూచన



2లో▸

## రపట్టభద్రుల ఓటరు నమోదుకు యువత భారీగా తరలిరావాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



వివరాలు 2 లో..

**కంటోన్మెంట్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం.. సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నేతల ప్రచారం**

: అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని టీచర్స్ కాలనీ పార్క్ వద్ద హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ పాల్గొన్నారు. ఓటరు నమోదుకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### నవంబర్ 6 వరకు ఓటరు నమోదుకు అవకాశం

ఎమ్మెల్యే శగణేశ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## చంద్రబాబుతో మరోసారి పవన్ భేటీ.. సీట్ల సర్దుబాటుపై చర్చ

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. పలుచోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సీఎం నివాసానికి పవన్ చేరుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న నేపథ్యంలో కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంట పాటు వీరిద్దరూ చర్చించారు. తెదేపా, జనసేన, భాజపాలోని ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఏకాభిప్రాయం సాధించే అంశంపై చంద్రబాబు, పవన్ చర్చించారు. గురువారం కూడా సీఎంతో పవన్ సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించిన విషయం తెలిసిందే.



## మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి




ప్రారంభించిన నెల రోజుల్లోనే మంచి స్పందన మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 3,885 కాల్స్

2లో▸

## ఎన్నికలు జరగకుండా చేయాలన్నదే వైకాపా కుట్ర



2లో▸

విజయవాడ: ఎలాగైనా ఎన్నికలు జరగకుండా చేయాలన్నదే వైకాపా కుట్ర అని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ ఆరోపించారు. అందుకే అభ్యర్థుల చేతిలో నామినేషన్లు లాక్కొని చించేశారని మండిపడ్డారు. విధ్వంసం వాళ్లు సృష్టించి.. ఆ నెపం తెదేపాపై పెడుతున్నారని ఆక్షేపించారు. పుంగనూరుతోపాటు చాలా చోట్ల వైకాపా విధ్వంసానికి పాల్పడిందని మండిపడ్డారు.

# కొండలమ్మ భక్తులకు అన్నప్రసాద వితరణ...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**



మండలంలోని వేమవరంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో జరుగుచున్న అన్న ప్రసాద వితరణలో భాగంగా శుక్రవారం అన్నప్రసాద వితరణను నిర్వహించారు. దాతలు గుడివాడ వాస్తవ్యులు డాక్టర్ బి.నాగేశ్వరరావు, లక్ష్మీ రమణ కుమారి దంపతులు మరియు కుటుంబ సభ్యులచే ఆర్థికసాయంతో కొండలమ్మ భక్తులకు ఈ అన్నప్రసాద వితరణను నిర్వహించినట్లు దేవస్థాన చైర్మన్ ఈడే మోహన్, ఈఓ ఆకుల కొండలరావు పేర్కొన్నారు. దాతలను శేష వస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

# జనసేనకే ప్రజా మద్దతు...

## గుడ్లవల్లేరులో జనసేన జడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణ భారీ ర్యాలీతో నామినేషన్... మద్దతుగా పాల్గొన్న ఎమ్మెల్యే రాము, కూటమి శ్రేణులు

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**

తీన్మార్ వాయిద్యాలు, టపాసుల మోతతో హోరెత్తిన గుడ్లవల్లేరు....



బలరామకష్ణకు మహిళల మంగళహారతులు.

.జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే రాము

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు...యువత ఉత్సాహంతో సందడిగా



మారిన గుడ్లవల్లేరు సెంటర్

100% స్ట్రైక్ రేట్ తో గుడివాడ నియోజకవర్గంలో కూటమి విజయం ఖాయం:ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మంచి పనులు..సంక్షేమ పథకాలే కూటమి గెలుపునకు అస్త్రాలు...

ఎమ్మెల్యే రాము నాయకత్వంలో గుడ్లవల్లేరు అభివద్ధిలో భాగస్వామ్యమవుతా:జడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణ

గుడ్లవల్లేరు మండలంలో జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణ నామినేషన్ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో నిర్వహించిన భారీ ర్యాలీలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో పాటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి

ముందుగా గుడ్లవల్లేరు పాలకేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మండల కూటమి నాయకులు జడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణకు అభినందనలు తెలియజేశారు. జనసేన వీర మహిళలు మంగళహారతులు ఇచ్చి ఆయనకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే రాము జనసేన జెండా ఊపి నామినేషన్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ గుడ్లవల్లేరు సెంటర్‌కు చేరుకునే వరకు ఆయన కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలకు అభివాదాలు చేస్తూ ముందుకు సాగారు.

గుడ్లవల్లేరు సెంటర్‌లోని భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాము, జడ్పీటీసీ అభ్యర్థి బలరామకష్ణ, కూటమి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోహార్ అంబేద్కర్ అంటూ నినాదాలు చేశారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. ఎమ్మెల్యే రాము, అభ్యర్థి బలరామకష్ణలకు కూటమి నాయకులు గజమాలలు వేసి సత్కరించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ...గుడివాడ నియోజకవర్గంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా కూటమి ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని, స్థానిక సంస్థల్లోనూ కూటమి బలాన్ని చాటుకునే దిశగా సమష్టి కషి చేస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో రికార్డు స్థాయి విజయాన్ని సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామాల అభివద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో కీలకమని రాము అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి అవసరాలను గుర్తించి అభివద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లగల నాయకత్వం అవసరమని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, స్థానిక నాయకత్వం నిర్ణయాలకు ప్రాధాన్యమిస్తూ అభ్యర్థుల విజయానికి కషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి కార్యకర్త ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని ప్రజల మద్దతును కూడగట్టాలని కోరారు. గుడ్లవల్లేరు మండలంలో కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు.

జనసేన జడ్పీటీసీ అభ్యర్థి వర్రె బలరామకష్ణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకత్వంలో కూటమి శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు సాగుతామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలు, గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాము చేస్తున్న అభివద్ధి పనులు కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతును అందిస్తాయని పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ఎమ్మెల్యే రామన్న నాయకత్వంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కషి చేస్తానని బలరామకష్ణ తెలిపారు. ఎమ్మెల్యే రాము మార్గదర్శకత్వంలో మండల సమగ్ర అభివద్ధిలో భాగస్వామిగా నిలుస్తానని, ప్రజలు తనపై ఉంచే నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కషి చేస్తానని పేర్కొన్నారు.

కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమష్టి భాగస్వామ్యంతో గుడ్లవల్లేరు మండలంలో స్థానిక ఎన్నికలను విజయవంతంగా ఎదుర్కొంటామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎన్నికల సమయకర్తలు సందు పవన్, పేర్ని జగన్, గుడ్లవల్లేరు టిడిపి అధ్యక్షుడు పోలవరపు వెంకట్రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అట్లూరి దిలీప్‌కుమార్, శ్రీ కొండలమ్మ ఆలయ చైర్మన్ ఈడే మోహన్, టిడిపి, జనసేన పార్టీల నాయకులు, పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య నేరాల నియంత్రణ, సమాచార మార్పిడి, సరిహద్దులు దాటి పోలీసు సమన్వయం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలిచింది.

### పోలీసింగ్‌లో నిరంతర సంస్కరణలు అవసరం

సమాజానికి భద్రత, రక్షణ అత్యంత ముఖ్యమైన పునాదులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమర్థవంతంగా, నైతిక విలువలతో, నిష్పక్షపాతంగా పనిచేసే పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాలను కూడా ఎప్పటికప్పుడు ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు వ్యవస్థకు అందించే వనరులను కేవలం ఖర్చుగా కాకుండా, మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు చేసే పెట్టుబడిగా పరిగణిస్తున్నామని వివరించారు. సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, ప్రతి పోలీసు విభాగం తన పనితీరును మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

### హైదరాబాద్‌లో మూడు పోలీసు కమిషనరేట్లు

నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కమిషనర్ తన పరిధిలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

అలాగే వివిధ రకాల నేరాలు, ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు హైడ్రా , ఈగల్ , టీ –సేఫ్ వంటి విభాగాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలను ప్రధాన సవాళ్లుగా పేర్కొంటూ, వీటి నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక శిక్షణ, సమర్థవంతమైన కార్యాచరణ అవసరమని అన్నారు.

తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోలీసు సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, నక్సలిజం నిర్మూలన వంటి రంగాల్లో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని చెప్పారు.

ప్రధాని నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం కేంద్ర ప్రభుత్వం నుంచి 80 శాతానికి పైగా మార్కులు సాధించిందని తెలిపారు. సైబర్ నేరాల బాధితులకు పోగొట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించే విషయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందన్నారు.

### ఆహార కల్తీ నియంత్రణకు టీజీ -సేఫ్

ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను పటిష్టం చేయడం కోసం వివిధ విభాగాల ప్రయత్నాలను సమన్వయం చేసేందుకు అమెరికాలోని ఎఫ్డీఏ తరహాలో టీజీ –సేఫ్ అనే కొత్త విభాగాన్ని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక విభాగాల పనితీరు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించడం ద్వారా తెలంగాణ దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు.

### పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం

విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పోలీసుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు పోలీసు సిబ్బంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా నిలిచేందుకు, కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు హోదా, సర్వీసు ఆధారంగా కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబాలకు గృహ నిర్మాణ స్థలాలు కేటాయించడంతోపాటు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి

మొదటి పేజీ తరువాయి




తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దార్శనిక నాయకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే సేవలను అందించేందుకు మీ సేవా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది.

ప్రజలు ఇకపై ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ నమోదు, ఆధార్ వివరాల అప్ డేట్ వంటి పలు సేవలను తమ ఇంటి వద్దనే పొందవచ్చు.లి ఇందుకోసం మీ సేవా కేంద్రాలు లేదా ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, క్యూలలో వేచి ఉండకుండా మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ సేవ ద్వారా సేవలను పొందే అవకాశం కల్పించారు. ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1100 కు కాల్ చేయడం, మీసేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఆతర్వాత మీ సేవా ప్రతినిధి నిర్ణీత సమయంలో ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.ప్రారంభం నుంచే లభించిన మంచి స్పందనలి

ఈ సేవ ప్రారంభమైన మొదటి నెలలోనే 1100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ప్రజల నుంచి 3,885 కాల్స్ వచ్చాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, పారదర్శకమైన పాలనను అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దార్శనికతలో ఈ కార్యక్రమం ఒక భాగం.

ప్రస్తుతం ఈ డోర్‌స్టెప్ సేవలు క్యూర్ (క్యూర్ ) పరిధిలోని ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బుక్ చేసుకున్న సర్వీస్ ప్రకారం వర్తించే సేవా రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

డోర్ స్టెప్ సేవలను ఎలా పొందాలి..?

1. టోల్‌ఫ్రీ నంబర్ ?1100కు కాల్ చేయండి లేదా మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయండి.
2. అవసరమైన ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ సేవను ఎంచుకుని, కాల్ సెంటర్ ప్రతినిధికి అవసరమైన వివరాలను అందించండి.3. నిర్ణయించిన సమయంలో మీ సేవా డోర్‌స్టెప్ ప్రతినిధి మీ ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.

# తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

మొదటి పేజీ తరువాయి

### మహారాష్ట్రతో త్వరలో చర్చలు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు జరిపేందుకు సిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ తర్వాత చర్చలకు పిలుస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో చర్చలకు అవసరమైన అన్ని నివేదికలు, సాంకేతిక వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది, మహారాష్ట్ర పరిధిలో ఎంత మేర భూమి ముంపునకు గురవుతుంది అనే అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అటవీ ప్రాంతాలు, గిరిజనులు అధికంగా నివసించే వెనుకబడిన ప్రాంతాలతో కూడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా బ్యారేజీ ఎత్తు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో చర్చించిన అంశాలు, వాటికి సంబంధించిన వివరాలన్నింటినీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర సమన్వయం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, ముంపు ప్రభావంపై సమగ్ర సమాచారంతో చర్చలకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### డిండి, అచ్చంపేటకు అదనపు నీరు

డిండి ప్రాజెక్టు, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యత పెంచే దిశగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అవసరాల కోసం మొత్తం 0.6 టీఎంసీల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని ఏదుల రిజర్వాయర్ వరకు తీసుకువచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా డిండి, అచ్చంపేట ప్రాంతాల అవసరాలను తీర్చడంతోపాటు పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. నీటిని తరలించేందుకు అవసరమైన పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర సాంకేతిక వ్యవస్థల ఏర్పాటును వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నీటి కేటాయింపులు, అంతర్రాష్ట్ర చర్చలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో జరగనున్న చర్చలు, డిండి––అచ్చంపేట పథకాలకు అదనపు నీటిని తరలించేందుకు చేపట్టే ఏర్పాట్లు తదుపరి కీలక పరిణామాలుగా నిలవనున్నాయి.

# సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి:

మొదటి పేజీ తరువాయి

ఈ ఘర్షణల సమయంలో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు" అని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటీబీపీని ఏర్పాటు చేశారు. 2004లో మనకు చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారు" అని అన్నారు.

### జమ్మూకశ్మీర్‌పై భారత్‌దే సార్వభౌమాధికారం

చైనా నే అత్యంత క్లిష్టమైన సరిహద్దు అని ఆయన అంగీకరించారు. గల్వాన్ తరహా ఘర్షణలను మెరుగ్గా ఎదుర్కోవడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేశామని, భూగర్భ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని తెలియజేశారు. చైనాతో ఉన్న 3,488 కి.మీ. పొడవైన వాస్తవాధీన రేఖ వెంబడి ఈ ఐటీబీపీ పహారా కాస్తుంటుంది. ఎత్తైన ప్రదేశంలో జరిగే ఘర్షణలను ఎదుర్కోవడం శౌర్య కమాండోల ప్రత్యేకత.

### దేశానికి సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

అరుణాచల్ వద్ద చైనా సైన్యంతో ఘర్షణలు జరిగినట్లు ఐటీబీపీ చీఫ్ వెల్లడించడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ అంశంపై దేశానికి సమాధానం చెప్పకుండా కేంద్ర ప్రభుత్వం మౌనాన్ని పాటిస్తోందని విమర్శించింది. ఇలా ఘర్షణలు జరుగుతున్నప్పటికీ చైనాకు మాత్రం రాయితీలను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టింది. "లద్దాఖ్‌లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లు చేజారిపోయాయని స్థానికులు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాల పేర్లను చైనా మారుస్తూనే ఉంది. మనకు ముప్పు కలిగించే ఆనకట్టను నిర్మిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ భద్రతకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు దేశానికి కావాలి" అని డిమాండ్ చేసింది.

# నవంబర్ 3 నుంచి ఇండో–– పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

మొదటి పేజీ తరువాయి

ఇండో––పసిఫిక్ ప్రాంతంలో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారత నౌకాదళం నవంబర్ 3 నుంచి 5 వరకు న్యూఢిల్లీలో ఇండో––పసిఫిక్ రీజినల్ డైలాగ్––2026 (ఐపీఆర్‌డీ) నిర్వహించనుంది. నేషనల్ మారిటైమ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ అంతర్జాతీయ వ్యూహాత్మక సదస్సులో 18 దేశాలకు చెందిన నిపుణులు పాల్గొననున్నారు.

'ఇండో––పసిఫిక్‌లో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారం' ప్రధాన ఇతివృత్తంగా సదస్సు జరగనుంది. సముద్ర పరిశోధనలు, విద్యాసంస్థల అనుసంధానం, మానవ వనరుల అభివృద్ధి, సముద్ర పాలన, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించనున్నారు.

భారత్ ప్రతిపాదించిన ఇండో––పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లోని సహకార అంశాలను ఆచరణాత్మక ప్రతిపాదనలుగా మలచడంపై సదస్సు దృష్టి సారించనుంది. 'మహాసాగర్' సముద్ర దార్శనికతకు అనుగుణంగా ప్రాంతీయ భద్రత, అభివృద్ధికి భాగస్వామ్యాలను ప్రోత్సహించనుంది.

మూడు రోజుల కార్యక్రమంలో ఐదు ప్రధాన చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యా––పరిశోధన నెట్‌వర్క్‌లు, కీలక సముద్ర మౌలిక వసతుల రక్షణ, సముద్ర విజ్ఞానం, వాతావరణ సవాళ్లు, సముద్ర పాలనలో సహకారం, పౌర––రక్షణ రంగాల్లో ఉపయోగపడే సాంకేతికతల ప్రభావాలు తదితర అంశాలను పరిశీలించనున్నారు. సంయుక్త పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, శాస్త్రీయ సమాచార మార్పిడి, సంస్థాగత భాగస్వామ్యాలకు కార్యాచరణ మార్గాలను చర్చించనున్నారు.

ప్రారంభ రోజున 'పర్‌స్పెక్టివ్స్ ఫ్రమ్ ది ఫ్లాగ్ బ్రిడ్జ్' ప్రత్యేక సమావేశంలో భారత్, శ్రీలంక మాజీ నౌకాదళాధిపతులు పాల్గొననున్నారు. 'సహయోగ్ కా సంవాద్' పేరిట రాయబారులతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలి రోజు స్మారకోపన్యాసం చేయనున్నారు.

వాతావరణ మార్పులు, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు, సముద్ర వనరులపై ఒత్తిడి వంటి సరిహద్దులు దాటిన సవాళ్లకు ఉమ్మడి పరిష్కారాలను అన్వేషించనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు సామాజిక, జీవ శాస్త్రాలు, మానవీయ శాస్త్రాల పాత్రనూ పరిశీలించనున్నారు. జాతీయ, ఉపప్రాంతీయ, ప్రాంతీయ స్థాయుల్లో అమలు చేయగల నిర్దిష్ట చర్యలను గుర్తించడమే సదస్సు ప్రధాన లక్ష్యం.

# జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

•ఉద్యోగులకు భద్రత కల్పించాలి: ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి

హనుమకొండ, అక్టోబర్ 23 (జనసముద్రం)





తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర కోశాధికారి నరేష్ డిమాండ్ చేశారు.రాష్ట్రవ్యాప్తంగా 78 ఉద్యోగ విభాగాల్లో పనిచేస్తున్న 17 వేల మందికి పైగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో గత 11 రోజులుగా కలెక్టరేట్‌ల ఎదుట నిరసన ధర్నాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న వారు మాట్లాడుతూ, దీర్ఘకాలంగా ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.ఉద్యోగుల సేవలను గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఇవే..జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులను ఎలాంటి షరతులు, పరీక్షలు లేకుండా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఒప్పంద ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం సేవా ప్రయోజనాలు కల్పించాలని, బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించడంతోపాటు, ప్రతి నెలా ఐదో తేదీలోపు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉద్యోగులకు ఏటా ఐదు శాతం వేతన పెంపు, ఎనిమిది శాతం విధేయత ప్రోత్సాహకాన్ని కల్పించాలని, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ప్రయోజనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఉద్యోగ విభాగాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని, అర్హులైన ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులతోపాటు వర్తించే ఇతర సెలవుల ప్రయోజనాలు కల్పించాలని కోరారు. పదవీ విరమణ సమయంలో లేదా అనుకోని పరిస్థితుల్లో ఉద్యోగులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలని, నిబంధనల ప్రకారం పింఛను, ముగింపు ప్రయోజనాలు తదితర సౌకర్యాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

25 ఏళ్ల సేవలకు గుర్తింపు ఇవ్వాలి

దాదాపు 25 ఏళ్లుగా ప్రజలకు నిరంతర వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, వారితో చర్చలు జరిపి న్యాయమైన పరిష్కారం చూపాలని నాయకులు కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగులకు కల్పిస్తున్న సేవా ప్రయోజనాలను పరిశీలించి, తెలంగాణలోనూ తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ధర్నాలో 300 మందికి పైగా పాల్గొనడం

ఈ నిరసన కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి వంగాల రాజేంద్రప్రసాద్, డాక్టర్ అభినందన్‌రెడ్డి, విజయచంద్రమౌళి, సంతోష్, డాక్టర్ మల్లేశం, డాక్టర్ సంయుక్త, డాక్టర్ రేణుక, డాక్టర్ కవిత, నర్సింగ్ సిబ్బంది, ఆయాలు సరిత, ప్రమీల, సహాయక నర్సులు, మంత్రసానులు జ్యోతి, లావణ్య, సరిత, సంధ్య తదితర నాయకులు పాల్గొన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సహాయక నర్సులు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు సహా సుమారు 300 మందికి పైగా

# దేవత్ పల్లి వాసి వైద్యానికి రూ.2.50 లక్షల సీఎం సహాయనిధి

బాధితుడికి అండగా నిలిచిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

జన సముద్రం న్యూస్ । నల్లగొండ । నాంపల్లి । । దేవత్ పల్లి । అక్టోబర్ 23



VEMULA SRINIVASULU, LLM, MBA, O.S.D. TO CHIEF MINISTER GOVERNMENT OF TELANGANA

Room No.3, 6th Floor, Dr.B.R.Ambedkar Telangana Secretariat Hyderabad. Ph.No. 040-23450466 Fax No. 040-23459944

CHIEF MINISTER'S OFFICE

Lr. No.14677/CMRF-LOC/2026, Dated:23-10-2026

To
The Director,
M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82.

Sir,

Sub:- CMRF-Sanction of LOC Under CMRF to M/s NIZAMS INSTITUTE OF MEDICAL SCIENCES, PUNJAGUTTA, HYDERABAD-82 towards treatment of individuals-Reg.

Ref:- 1. Letter from the SRI RAJ GOPAL REDDY KOMATIREDDY, MLA - MUNUGODE, dt.22-10-2026

@@@

The Hon'ble Chief Minister desires that the treatment of Kothagolli Venkataiah, S/O NARSIMHA, DEVATHPALLI, NALGONDA be extended as the Hon'ble Chief Minister has assured for sanction of an amount of Rs. 2,50,000/- (Rupees Two Lakh Fifty Thousand Only) to undergo CRESCENTRIC GLOMERUNEPHRITIS HEMOTHORAX DECORTICATION

Necessary action may please be taken for providing treatment to the individual and send the bill after completion of the treatment.

With best wishes,

Yours sincerely,

(Vemula Srinivasulu)

Copy to:
SRI RAJ GOPAL REDDY KOMATIREDDY,
MLA - MUNUGODE
Copy to:
Kothagolli Venkataiah
S/O NARSIMHA
DEVATHPALLI, NALGONDA

Note:- This letter does not require physical signature and this certificate can be verified by scanning QR code printed on this letter.

అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా లభించింది.నాంపల్లి మండలం దేవతపల్లి గ్రామానికి చెందిన కొత్తగొల్ల వెంకటయ్య తండ్రి నర్సింహా ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్నారు.మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు చొరవ తీసుకున్నారు.వెంకటయ్యకు మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ.2,50,000 (రెండు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన ఎల్ఓసీ మంజూరయ్యేలా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు కృషి చేశారు.ఈ ఆర్థిక సహాయం ద్వారా బాధితుడికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు తోడ్పాటు లభించనుంది. అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో వైద్య ఖర్చుల భారం కుటుంబంపై పడకుండా ప్రభుత్వ సహాయనిధి ద్వారా అండ లభించడం బాధిత కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చే విషయం.

ప్రజల ఆరోగ్యం సంక్షేమం పట్ల ప్రజాప్రతినిధులు చూపుతున్న చొరవకు ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలుస్తోంది.ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వెంకటయ్య త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని దేవత్ పల్లి గ్రామస్థులు ఆకాంక్షిస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన మునుగోడు ఎమ్మెల్యే శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎల్‌నినో ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

•సల్పురం గ్రామపంచాయతీ ప్రజలకు కాంగ్రెస్ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ సూచన

జన సముద్రం న్యూస్ । నల్లగొండ । నాంపల్లి । దేవత్ పల్లి । అక్టోబర్ 23



ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సల్పురం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ సూచించారు. వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా వీరమల్ల రవిగౌడ్ మాట్లాడుతూ రైతులు పంటల సాగు విషయంలో వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.వర్షపాతం ఉష్ణోగ్రతల్లో మార్పులను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే సూచనలు సలహాలను పాటిస్తూ పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతంలో మార్పులు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని అందుబాటులో ఉన్న నీటిని అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా ఉపయోగించుకోవాలని సూచించారు.పంటల ఎంపిక విత్తనాల వినియోగం సాగు విధానాల విషయంలో స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు.గ్రామ ప్రజలు వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు వ్యవసాయ రంగానికి సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని వీరమల్ల రవిగౌడ్ కోరారు.రైతులు అనవసర ఆందోళనలకు గురికాకుండా శాస్త్రీయ పద్ధతులు మరియు నిపుణుల సలహాల ఆధారంగా వ్యవసాయ పనులు చేపట్టాలని సూచించారు. రైతుల సంక్షేమం పంటల రక్షణకు ముందస్తు అవగాహన ఎంతో ముఖ్యమని పేర్కొంటూ సల్పురం గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు ప్రజలు వాతావరణ పరిస్థితులను బట్టి తగిన జాగ్రత్తలు పాటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వీరమల్ల రవిగౌడ్ విజ్ఞప్తి చేశారు.

# నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తి

•డిండి ఆయకట్టు పంటలను కాపాడేందుకు కల్వకుర్తి నీటిని తక్షణమే విడుదల చేయాలి

•పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరిన ఎమ్మెల్యే

జన సముద్రం న్యూస్ అక్టోబర్ 23.దేవరకొండ.

జిల్లా నల్గొండ ప్రతినిధి. ఎండీ. తన్వీర్



తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావంతో డిండి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు వెంటనే నీటిని విడుదల చేసి, పంటలు ఎండిపోకుండా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

లిఎండుతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు

వర్షాభావ పరిస్థితుల కారణంగా డిండి ప్రాజెక్టు పరిధిలో నీటి కొరత తీవ్రంగా ఉందని, దీంతో ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే పంటలపై వర్షాభావ ప్రభావం పడుతున్న నేపథ్యంలో ఆలస్యం జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు

అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి

రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి పంట నష్టాన్ని నివారించేందుకు అత్యవసర ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకుని, డిండి ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు

# జిల్లాలో రీ-సర్వే పకడ్బందీగా నిర్వహించాలి,శిక్షణ కార్యక్రమంలో ఏసీ అనిల్ కుమార్

మహబూబాబాద్, అక్టోబర్.23జనసముద్రం





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు చీఫ్ కమీషనర్ అఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, హైదరాబాద్ గారి ఆదేశాల మేరకు, జిల్లాలో భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని పెంపొందించడం, భూముల సరిహద్దులను నిర్ధారించడం, రీ-సర్వే ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రీసర్వే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. అనిల్ కుమార్ , మరియు జిల్లా సర్వే అధికారి శ్రీనివాస్ శిక్షకులుగా వ్యవహరించి, పాల్గొన్న అధికారులకు, సిబ్బందికి రీ-సర్వే ప్రక్రియపై సమగ్ర శిక్షణ అందించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ-సర్వే నిర్వహణ విధానం, క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన, భూముల సరిహద్దుల గుర్తింపు, ల్యాండ్ పార్సెల్ మాడ్యూల్స్ తయారీ, సర్వే వివరాల సేకరణ, సంబంధిత రెవెన్యూ రికార్డులతో వివరాల సరిపోలిక, ఆన్‌లైన్‌లో డేటా నమోదు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.

అదేవిధంగా రీ-సర్వే ప్రక్రియలో రెవెన్యూ మరియు సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయడం, భూ వివరాల్లో ఖచ్చితత్వాన్ని నిర్ధారించడం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించడం, రైతులకు సంబంధించిన భూ వివరాలను జాగ్రత్తగా పరిశీలించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

ప్రతి మండలంలో ఏర్పాటు చేసిన రీ-సర్వే బృందాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమన్వయంతో పనిచేస్తూ, రీ-సర్వే పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. రీ-సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో రీ-సర్వే పనులను సమర్థవంతంగా అమలు చేసి, భూ రికార్డుల ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడంతో పాటు రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించడమే ముఖ్య లక్ష్యం అని అన్నారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, అలాగే ప్రతి మండలానికి ఏర్పాటు చేసిన రీ-సర్వే బృందాల సభ్యులు పాల్గొన్నారు.

జనసముద్రం జిల్లా రిపోర్టర్
మెంగు సతీష్

# జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపునకు మద్దతుగా నిలుస్తాం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

• -డంపింగ్ యార్డు ఎత్తివేతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని జేఏసీ వినతి.హైదరాబాద్ పరిసరాల్లో 6 నుంచి 10 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్



( జనసముద్రం జవహర్ నగర్ అక్టోబర్ -23)

జవహర్ నగర్ రాంకీ డంపింగ్ యార్డు తొలగింపు కోసం జరుగుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరుతూ జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత జేఏసీ పోరాట కమిటీ నాయకులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం, అక్టోబర్ 23న ఎమ్మెల్యేను కలిసిన జేఏసీ ప్రతినిధులు.. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చట్టసభల్లో తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీల సహకారం అందించాలని కోరారు.

ఈ సందర్భంగా జేఏసీ పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి మాట్లాడుతూ.. గతంలో ఆటోనగర్ డంపింగ్ యార్డు సమస్యపై పోరాటం చేసిన నేతగా సుధీర్ రెడ్డికి గుర్తింపు ఉందని తెలిపారు. ప్రస్తుతం మన్సూరాబాద్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన సమస్యపై కూడా ఆయన 20 కాలనీల్లో పర్యటించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.

జవహర్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా భూగర్భ జలాలు, గాలి, నీరు కలుషితమై మహిళలు, పిల్లలు, వృద్ధుల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని షేక్ షావలి ఆవేదన వ్యక్తం చేశారు. అఖిలపక్షంలో భాగంగా సుధీర్ రెడ్డి సైతం ఈ సమస్య తీవ్రతను గుర్తించి ప్రస్తావించారని తెలిపారు. డంపింగ్ యార్డు తొలగింపునకు నిర్దిష్ట గడువు ప్రకటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని కోరినట్లు వెల్లడించారు.

దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.. జవహర్ నగర్ డంపింగ్ యార్డు తొలగింపు పోరాటానికి మద్దతుగా నిలుస్తామని ప్రకటించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడి చెత్తను అక్కడే నిర్వహించే విధంగా 6 నుంచి 10 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు సీపీఎం శివన్నారాయణ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ వి. ప్రవీణ్, జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీకి చెందిన మహ్మద్ పాషామియా, టీవీఆర్ఎస్ మోనార్ దుర్గాప్రసాద్,చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, పీఓడబ్ల్యూ (విముక్తి) గడిపె సునీత, జర్నలిస్ట్ కొన్నె వేణు, టీయూసీఐ జి.లింగం తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి లక్కీకి శుభాకాంక్షలు తెలిపిన సతీష్ కుమార్

లక్కీ భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలి: ప్రముఖుల ఆకాంక్ష

హనుమకొండ అక్టోబర్ 23(జనసముద్రం)





తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ చిన్న కుమార్తె హింగే లక్కీ జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ నివాసంలో చిన్నారి లక్కీని శాలువాతో సత్కరించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఫర్టిలైజర్ అండ్ సీడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు, కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఏసీపీ శ్రీనివాస్ జి., తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు తదితరులు లక్కీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.చిన్నారి లక్కీ జీవితంలో మరెన్నో పుట్టినరోజులను ఆనందంగా జరుపుకోవాలని, చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రముఖులు ఆకాంక్షించారు.

# మహేశ్వరంలో రూ.60 కోట్ల భారీ భూ కుంభకోణం

**•పేరేడు 1 నుంచి 6 వరకు భూములపై విచారణకు డిమాండ్**

**•గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు గా ఉన్నవారే కబ్జా చేశారు**

**జనసముద్రం న్యూస్ మహేశ్వరం:**

మహేశ్వరం మండల కేంద్రంలోని పేరేడు 1 నుంచి 6 వరకు ఉన్న గ్రామకంఠం భూముల వివరాలు, లేఅవుట్ అనుమతులు, భూముల విస్తీర్ణంపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకిశ్వర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ భూముల మార్కెట్ విలువ సుమారు రూ. 60 కోట్ల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



### పేరేడు భూముల వివరాలివే

కాకిశ్వర్ ముదిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పేరేడు 1లో 2.11 గుంటలు, పేరేడు 2లో 1.35 గుంటలు, పేరేడు 3లో 0.11 గుంటలు, పేరేడు 4లో 0.35 గుంటలు, పేరేడు 5లో 0.27 గుంటలు, పేరేడు 6లో 0.06 గుంటల భూమి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన తెలిపిన ఈ వివరాల ప్రకారం మొత్తం భూమి 9.05 గుంటలు కలదు.

### లేఅవుట్ అనుమతులపై సందేహాలు

పేరేడు 1, 2 ప్రాంతాల్లో సుమారు 72 ప్లాట్లతో లేఅవుట్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని కాకిశ్వర్ తెలిపారు. ఈ లేఅవుట్‌కు సంబంధించి సంబంధిత అధికారుల అనుమతులు ఉన్నాయా? భూమి విస్తీర్ణం ఎంత, ఇప్పటివరకు హ లేఅవుట్ లో ఎన్ని విక్రయాలు జరిగాయి? అనే అంశాలపై విచారణ చేపట్టాలని కోరారు. గ్రామకంఠం భూములుగా పేర్కొంటున్న స్థలాల వాస్తవ పరిస్థితిని సర్వే చేసి, రికార్డులతో సరిపోల్చాలని అన్నారు.

### ఆర్టీఐ ద్వారా వివరాల సేకరణ

లే అవుట్ భూములకు సంబంధించిన ఇంకా కొన్ని డాకుమెంట్స్ కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు కాకిశ్వర్ వెల్లడించారు. ఈ నెల 18న స్థానిక సర్పంచ్ మునగపాటి నవీన్ కూడా ఇదే అంశంపై దరఖాస్తు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పత్రాలు, అనుమతులు, భూముల వర్గీకరణ వివరాలను పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు.

### ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

పేరేడు 1, 2లోని భూముల్లో కొంత భాగాన్ని బస్టాండ్‌కు, మరికొంత భాగాన్ని శివాలయానికి కేటాయించాలనే అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కాకిశ్వర్ తెలిపారు. పేరేడు 3 నుంచి 6 వరకు ఉన్న భూముల వివరాలను కూడా పరిశీలించాలని కోరారు. గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన కొందరు పేరేడు 1 నుండి 6వరకు ఉన్న 9.05 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి లే అవుట్ గా మార్చి ప్లాట్లు అమ్మకాలు, కొనుగోలు చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ అంశాలపై రిజిస్ట్రేషన్ పత్రాలు, లేఅవుట్ అనుమతులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. ప్రభుత్వ భూముల విషయం పై వాస్తవాలను ప్రజలకు వివరిస్తే తనపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని కాకిశ్వర్ పేర్కొన్నారు. తాను గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, తనపై వచ్చిన ఆరోపణలైనా, తాను చేస్తున్న ఆరోపణలైనా ఆధారాలతోనే తేలాలని అన్నారు. పేరేడు 1 నుంచి 6 వరకు ఉన్న భూములపై సమగ్ర విచారణ జరిపి, ఎలాంటి అక్రమ లావాదేవీలు జరగకుండా చూడాలని తహశీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ అధికారులను కోరారు. త్వరలోనే తన వద్ద ఉన్న ఆధారాలతో జిల్లా కలెక్టర్, సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులను కలిసి ఈ అంశాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని కాకిశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బంగారిగళ్ల లాజార్, గద్దగూటి జంగయ్య ముదిరాజ్, కాకి మల్లేష్ ముదిరాజ్, అల్లే రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలో పారదర్శకంగా నియామక ప్రక్రియ,





**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23, 2026**

ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అభ్యర్థుల ప్రతిభ, మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగంలో అధ్యాపకుల కొరకు నిర్వహించిన నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాత పరీక్ష, పి.జి. మార్కులు, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని, అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ, అనుభవం తదితర అంశాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు సాధించిన మార్కులతో పాటు, పి.జి. మార్కులకు నిర్దేశించిన వెయిటేజీని పరిగణనలోకి తీసుకొని తుది మెరిట్‌ను నిర్ణయించడం జరిగిందని, ఈ ప్రక్రియలో అభిషేక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, ఎంపిక చేసేందుకు కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థి త్వరలో విధులలో చేరేలా నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల మైదానం అభివృద్ధి, క్రీడా వసతుల కల్పన, త్రాగునీటి సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెడుదారిలో పయనిస్తున్న యువత భవిష్యత్తుపై ఆందోళన

**•చెడు అలవాట్లకు బానిస అవుతూ లక్ష్యాలకు దూరం యువతను సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది: సైదయ్య**

**జన సముద్రం న్యూస్ । నల్లగొండ । నాంపల్లి । దేవత్ పల్లి। అక్టోబర్ 23**

నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం. అయితే కొంతమంది యువకులు చెడు అలవాట్లకు బానిసలవుతూ తమ విలువైన జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టుకోవడం ఆందోళన కలిగిస్తోంది. మద్యం మత్తు పదార్థాలు చెడు స్నేహాలు సామాజిక మాధ్యమాల వినియోగంలో నియంత్రణ లేకపోవడం వంటి అంశాలు యువత భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి.



### చెడు అలవాట్లతో జీవితాలు చిన్నాభిన్నం

చదువుపై ఆసక్తి తగ్గడం ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం కుటుంబ సభ్యులతో విభేదాలు ఆర్థిక ఇబ్బందులు వంటి సమస్యలు కొంతమంది యువతను వెనక్కి నెడుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుంటే మరికొందరు యువకులు తాత్కాలిక ఆనందాల కోసం తమ లక్ష్యాలకు దూరమవుతున్నారు. సరైన సమయంలో మార్గదర్శనం అందకపోవడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

### చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి

స్నేహం జీవితంలో ముఖ్యమైనదే. అయితే స్నేహితుల ప్రభావంతో చెడు అలవాట్లకు లోనుకావడం ప్రమాదకరం. యువత తమ లక్ష్యాలను గుర్తించి చదువు ఉపాధి క్రీడలు సామాజిక సేవ వంటి మంచి కార్యక్రమాలకు సమయాన్ని కేటాయించాలి. తప్పు దారిలో వెళ్తున్నామని గుర్తించినప్పుడు వెనక్కి తగ్గి, మంచి మార్గంలో ముందుకు సాగేందుకు ప్రయత్నించాలి.

### తల్లిదండ్రులు సమాజం బాధ్యత తీసుకోవాలి

యువతను నిందించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదు. వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకొని అవసరమైన మార్గదర్శనం అందించాలి. పాఠశాలలు కళాశాలలు, యువజన సంఘాలు ప్రజాప్రతినిధులు కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడం వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించాలి.

### యువత మారితేనే దేశం మారుతుంది

యువతలో అపారమైన శక్తి, ప్రతిభ పట్టుదల ఉన్నాయి. వాటిని సరైన దిశలో వినియోగిస్తే కుటుంబానికి సమాజానికి దేశానికి ఎంతో మేలు చేయవచ్చు. చెడు అలవాట్లను విడిచిపెట్టి మంచి లక్ష్యాలను ఎంచుకొని కష్టపడి పనిచేస్తే విజయాన్ని సాధించవచ్చు. ప్రతి యువకుడు తన భవిష్యత్తును తానే నిర్మించుకోవాలనే సంకల్పంతో ముందుకు సాగాలి.

### సైదయ్య పిలుపు:

నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ మంచి లక్ష్యాలను సాధించి కుటుంబానికిం గర్వకారణంగా నిలవాలి. యువతను సరైన మార్గంలో నడిపించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి

# జవహర్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర అక్టోబర్ 23:**

మధిర మండలం వంగవీడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కృషితో రూ. 630.30 కోట్లతో నిర్మితమవుతున్న జవహర్ ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తయితే మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం మెరుగుపడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను గుర్తించి, వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో భట్టి విక్రమార్క గారు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రైతాంగానికి అండగా నిలుస్తాయని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సమస్యలు తగ్గి, వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు



నరసింహారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరం శెట్టి కిషోర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సిద్దిపోగు ప్రసాద్, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, లక్ష్మారెడ్డి, ఎక్కిటాల కృష్ణారావు, ఓబుల్ లక్ష్మారెడ్డి, బండి వెంకటేశ్వర్లు, గూడెల్లి వెంకటేశ్వర్లు, దర్శి కిరణ్, సక్రు, బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23, 2026:**

ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్ ను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ రైస్ మిల్లుకు కేటాయించిన వరి ధాన్యం లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సి.ఎం.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని భీమారం మండల ఉప తహసిల్దార్ అంజమ్మ తో కలిసి సందర్శించి గ్రామంలో చేపట్టే రీ సర్వే ప్రక్రియను ఉదయం సమయంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టిక, భూభారతి



దరఖాస్తుల పరిశీలన, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. పాఠశాలలోని స్టోర్ గది, వంటగదిని తనిఖీ చేసి, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. దసరా సెలవుల అనంతరం



పాఠశాల పునః ప్రారంభమైనందున పాఠశాలను శుభ్రపరచాలని, విద్యార్థినులకు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, ఇతర వైద్య సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ విమానాశ్రయానికి మాజీ ప్రధాని పీవీ పేరు పెట్టాలి





**-సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు**

**జనసముద్రం న్యూస్ కోహెడ అక్టోబర్ 23: (కోహెడ ప్రసాదరావు)**

చారిత్రాత్మకమైన వరంగల్ లో త్వరలో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి భారత మాజీ ప్రధాని,భారతరత్న పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లు చొరవ తీసుకొవాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఈ మేరకు కరీంనగర్ లో ఆయన మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలోని రెండవ పెద్ద నగరం అయిన వరంగల్ పూర్వకాలంలో కాకతీయుల రాష్ట్ర రాజధానిగా పేరు ప్రతిష్టలు పొందినదని అన్నారు.ప్రపంచంలో గొప్ప విద్యావిత్తగా విశ్వవిజ్ఞానిగా బాహుబషా కోవిదుడు ఆర్థిక సంస్కరణలు, భూసంస్కరణ ల రూపశిల్పిగా ప్రపంచ స్థాయిలో పేరు ప్రతిష్టలు పొందిన పీవీ నరసింహారావు యొక్క పేరును ప్రపంచ స్థాయి హంగులతో సౌకర్యాలతో ప్రపంచ స్థాయి పర్యటకులను ఆకర్షించే విధంగా రూపుదిద్దుకుంటున్న వరంగల్ లోని మామునూరులో నిర్మిస్తున్న విమానాశ్రయానికి పీవీ నరసింహారావు పేరు పెట్టవలసిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. ఈ ప్రాంతానికి దేశానికి పీవీ నరసింహారావు చేసిన సేవలకు నిదర్శనంగా వరంగల్ లో నిర్మించే విమానాశ్రయంలో పీవీ పేరు పెట్టడం సమంజసంగా ఉంటుందని ఆయనకు తగిన గౌరవాన్ని ప్రాధాన్యతను ఇచ్చిన వారం అవుతామని అన్నారు. అలాగే విమానాశ్రయం ఆవరణలో పివి విగ్రహాన్ని ప్రతిష్టించి పీవీ యొక్క జీవిత చరిత్రను తాను రాసిన పుస్తకాలను. పరిశోధనలను ఒక లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు అభిమానులు సుభాష్, ఏస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలి

**•వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.800 వేతనం ఇవ్వాలి: బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్**

**ఎల్కతుర్తి అక్టోబర్ 23 (జనసముద్రం)**

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని భారతీయ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కరువు పరిస్థితులతో వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం



రాష్ట్రానికి అదనపు నిధులు కేటాయించి గ్రామీణ కూలీలను ఆదుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధి కోల్పోయి తిండి, బట్టలకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని దినాలను పెంచి, కూలీలకు నిరంతరం పని కల్పించాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు అడుగంటడం, బావుల్లో నీరు లేకపోవడం, పంటలు చేతికి రాకపోవడంతో రైతులు, వ్యవసాయ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో పశువులకు పశుగ్రాసం కూడా దొరకని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీలకు పని కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ. 800 వేతనం చెల్లించాలని, ఉపాధి హామీ పథకం కింద సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని కర్రె లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు మునియాల బిక్షపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు సాంబయ్య, బిల్కురి తులసిరావు తదితరులు పాల్గొన్నారు.

### సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కంద పెద్ద నర్సింహ

**కందుకూరు న్యూస్ (అక్టోబర్ 23)జనసముద్రం**

మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని టీ ఎంఆర్పిఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కంద పెద్ద నర్సింహ మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ సందర్భంగా దసరా పండుగ ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని కంద పెద్ద నర్సింహ ఆకాంక్షించారు. పండుగలు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడివెల్లి మాజీ సర్పంచ్ మస్కు బాబు, కొలన్ గూడ మాజీ సర్పంచ్ గణేష్, రావిచెట్టి శ్రీనివాస్, వంక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో - యాసంగిలో ఆరుతడి పంటల సాగు

- భూసార సంరక్షణ కార్యక్రమాలు
- ఖేత్ బచావో..అభియాన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**పెద్దవంగర/ మహబూబాబాద్, అక్టోబర్.23 జనసముద్రం**

జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పెద్దవంగర మండలం, అవుతాపురం రైతు వేదికలో ఖేత్ బచావో..అభియాన్ కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల్లో బోర్లు, బావులు కింద నిత్య ఆదాయం ఇచ్చే మార్కెట్ డిమాండ్ ఉన్న ఆరుతడి పంటలు అయిన ఆయిల్ పామ్, కోకో, వక్క, జాజికాయ, మిరియాలు, కొబ్బరి, కూరగాయలు, ఉల్లి, పండ్ల తోటలు, పూలు, మల్బరీ, మునగ, మొదలైన ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వాంకుడోతు చిలుకమ్మ, సోంల, బానోతు శ్రీనివాస్, క్షేత్రాలను సందర్శించి వారు సాగు చేస్తున్న కూరగాయలు, పుచ్చ, కర్బూజ, బొప్పాయి సాగు గురించి అడిగారు. బిందు సేద్యం, మల్చింగ్ మొదలైన రాయితీలు ఉపయోగించుకొని సాగు చేస్తున్నామని వివరించారు. వారు కూరగాయలు, పుచ్చ, కర్బూజ, బొప్పాయి పంటల సాగుతో స్వల్ప కాలంలోనే ఎకరానికి ఖర్చులు పోను రెండు లక్షల ఆదాయం పొందుతున్నామని వివరించారు. ఖమ్మం జిల్లాలో రైతులనుండి వీటి సాగు తెలుసుకొని గత పది సంవత్సరాల నుండి పత్తి, మిరప, వరికి బదులుగా ఆరు తడి పంటలైన కూరగాయలు, పుచ్చ,





కర్బూజ, బొప్పాయి సాగు చేస్తున్నామని తెలిపారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా "పంట మార్పిడి" చేసి ప్రతీ మండలంలో అన్ని రకాల కూరగాయలు, ఆయిల్ పామ్, పండ్ల తోటలు, పూల తోటలు, మల్బరీ, చిరు ధాన్యాలు, అపరాలు, నూనె గింజలు వంటి పలు పంటలతో పాటు నూతన పంటలైన ఔషధ మరియు సుగంధ తైల పంటలు, కొబ్బరి, కోకో, అవకాడో పంటల సాగుతో అధిక ఆదాయంఇచ్చే, అవసరానికి తగ్గట్టుగా పంటలు సాగు చేయాలని అన్నారు.

పంట మార్పిడి నీ పాటించాలి ప్రతి గ్రామంలో బోర్లు బావులు కింద 50 ఎకరాలలో ఆదాయం ఇచ్చే మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, కూరగాయలు పండ్లు పూలు, మల్బరీ, ఉల్లి, నూనె గింజలు, చిరుధాన్యాలుమొదలైనవి సాగు చేయాలి.

ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో పశువుల సంరక్షణపై కలెక్టర్ రైతులకు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

పశువులకు ఎల్లప్పుడూ శుభ్రమైన నిల్వ చేసుకోవాలని అన్నారు.

వేడి ఒత్తిడి లక్షణాలు కనిపించినప్పుడు పశువులను చల్లటి నీడలో ఉంచి, వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు పశు గ్రాస విత్తనాలను పంపిణీ చేశారు.

ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా గ్రామీనాభివృద్ధి అధికారి మధుసూదన రాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, జిల్లా పట్టు పరిశ్రమ, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, కూరగాయల రైతులు కోమరబోయిన ఎల్లయ్య, కోడిశెట్టి శ్రీనివాస్, బోయిన ఉప్పలయ్య, వాంకుడోతు చిలుకమ్మ , తదితరులు పాల్గొన్నారు.

జన సముద్రం జిల్లా రిపోర్టర్
మెంగు సతీష్

# సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి,

- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23, 2026:**

జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమారం మండలంలోని భీమారం, బూరుగుపల్లి, గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యా కార్యక్రమాలు, పారిశుధ్య నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ పనులు, పలు ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రం, పంట కుంటలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులు, గ్రామ పంచాయతీ రికార్డులు, ఇంకుడు గుంతలు, సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అభ్యాసనంలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సేవలు, సదుపాయాలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధన, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. భీమారం గ్రామంలో చేపట్టిన పంట కుంట పనులను పరిశీలించి, వ్యవసాయ అవసరాలకు వర్షపు నీటిని నిల్వ చేసుకునేలా పనులను



నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణ పనులను ప్రారంభించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాల పెంపునకు వినియోగించుకోవడం ఎంతో అవసరమని, నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యతతో చేపట్టి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూరుగుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను సక్రమంగా, ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, విధుల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, పనుల పురోగతి, రికార్డుల నిర్వహణలో పూర్తి జవాబుదారీతనంతో పని చేయాలని



తెలిపారు. గ్రామంలోని ఇంకుడు గుంతలను పరిశీలించి, నిర్వహణ తీరును సమీక్షించారు. గ్రామాలలో మురుగునీటి నిర్వహణ సక్రమంగా ఉండేలా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల కేంద్రంలోని సమీకృత ఎస్.సి., బి.సి. వసతి గృహాలను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, త్రాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, వసతి గృహంలో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీణ, మండల విద్యాధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సతీష్, ఏపీఓ, భీమారం సర్పంచ్ ఉష్క మల్ల విజయలక్ష్మి-పున్నం చంద్, , పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి,

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23, 2026:**

జిల్లాలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తూ, తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ తో కలిసి మండల వ్యవసాయ అధికారులతో వ్యవసాయ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా ఆరుతడి పంటల సాగుపై రైతులకు వివరించాలని, నవంబర్ 30వ తేదీ వరకు జిల్లాలోని రైతు వేదికలలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, రైతులు ఈ



అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మండలాల వారీగా పంటల వైవిధ్యీకరణ ప్రణాళికలను రూపొందించి, గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ప్రోత్సహిస్తూ, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు విత్తనాల విక్రయాలపై పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. మొక్కజొన్న పంటకు కనీస మద్దతు ధర, వరి సన్న ధాన్యం కొనుగోళ్లు, పత్తి పంట కోతలు, కొనుగోలు ప్రక్రియకు సంబంధించిన అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించడంతో పాటు కూరగాయల విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కడెం ప్రాజెక్టు నీటిని త్రాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లాలని, యాసంగిలో విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గుల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున, ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నీటి పొదుపు సాగు విధానాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల వారీగా తక్కువ నీటితో విజయవంతంగా పంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి, వారు అనుసరిస్తున్న పద్ధతులను ఇతర రైతులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. విజయవంతమైన సాగు విధానాలను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా జిల్లాలో నీటి పొదుపు వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిజమైన అర్హులైన పేద కుటుంబాలకే డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలి

- లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి -- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, జనసముద్రం న్యూస్ అక్టోబర్ 23**

మల్కాజిగిరి నియోజకవర్గంలోని గృహ నిర్మాణ సమస్యలను పరిష్కరించి, అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్ ఐఏఎస్‌ను ఇతర ఎమ్మెల్యేలతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో పారదర్శకత



డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, నిజమైన అర్హులైన పేద కుటుంబాలకు న్యాయం జరిగేలా లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే కౌకూరులో ప్రతిపాదించిన ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి త్వరితగతిన భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాజీవ్ గృహకల్ప, వాంబే ఇళ్లకు తాగునీటి సౌకర్యం

కౌకూరులోని రాజీవ్ గృహకల్ప, వాంబే గృహ సముదాయాల నివాసితులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ, జలమండలి అధికారులు సమన్వయంతో పనిచేసి, అవసరమైన నీటి నిల్వ ట్యాంకులు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి నివాసితులకు నిరంతర తాగునీటి సరఫరా అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. అనంతరం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేష్, బండారి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి మండలంలో దేవాలయాలే లక్ష్యంగా చోరీలు!

**పూజా గంటలు, నిత్య పూజా సామగ్రి అపహరణ.. నిందితుల ఆచూకీ ఏదీ?**

**ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారిపై నిఘా పెట్టాలంటున్న స్థానికులు.**

**పోలీసుల గస్తీ పెంచాలని విజ్ఞప్తి**




**ఎల్కతుర్తి, అక్టోబర్ 23 (జనసముద్రం)**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో దేవాలయాల్లో వరుసగా చోటుచేసుకుంటున్న చోరీ ఘటనలు స్థానికంగా ఆందోళన కలిగిస్తున్నాయి. మండల కేంద్రంలోని ఓ దేవాలయంతో పాటు సూరారం గ్రామంలోని గుడిబండపల్లె, వల్లభాపూర్, కోతులనడుమ దేవాలయంలోనూ గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. రాత్రి వేళల్లో దేవాలయాల్లోకి ప్రవేశించిన దుండగులు పూజా గంటలు, నిత్య పూజలకు ఉపయోగించే సామగ్రిని అపహరించినట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. దేవాలయాల్లో ప్రతిరోజూ భక్తిశ్రద్ధలతో నిర్వహించే నిత్య పూజలకు అవసరమైన సామగ్రి చోరీకి గురవుతుండటంతో భక్తులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయాల్లోకి చొరబడి పూజా సామగ్రిని అపహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుస ఘటనలు జరుగుతున్నా ఆలయాల భద్రతకు పటిష్టమైన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**గతంలోనూ పలు ఆలయాల్లో చోరీలు**

ఎల్కతుర్తి మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోని పలు దేవాలయాల్లో గతంలోనూ చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఆలయాల్లో తరచూ చోరీలు జరుగుతున్నప్పటికీ నిందితులను గుర్తించి, ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయడంలో మరింత సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. దేవాలయాల్లోని గంటలు, పూజా సామగ్రి వంటి వస్తువులు సైతం భద్రంగా లేని పరిస్థితి నెలకొంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఎలా ఉంటుందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో సరైన నిఘా లేకపోవడం, ఆలయాల వద్ద భద్రతా ఏర్పాట్లు కొరవడటం చోరీలకు అవకాశమిస్తోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**గ్రానైట్ కంపెనీలు, జాతీయ రహదారి ప్రాంతాల్లో నిఘా పెంచాలి**

ఎల్కతుర్తి మండల పరిసర ప్రాంతాల్లో గ్రానైట్ కంపెనీలు, జాతీయ రహదారి ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి పలువురు ఉపాధి కోసం ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారి వివరాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, చట్టబద్ధమైన పరిధిలో తగిన నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. బయటి ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వారిలో ఎవరైనా చోరీలకు పాల్పడుతున్నారా అనే అనుమానాలు కొందరు గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నప్పటికీ, తాజా ఘటనల్లో నిందితులు ఎవరనేది ఇంకా నిర్ధారణ కాలేదు. కేవలం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసిస్తున్నారనే కారణంతో ఎవరినీ అనుమానితులుగా చూడకుండా, ఆధారాల ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రానైట్ కంపెనీల పరిసర ప్రాంతాలు, జాతీయ రహదారి వెంబడి ఉన్న నివాస ప్రాంతాలు, అద్దె ఇళ్ల వివరాలపై సంబంధిత అధికారులు సమన్వయంతో దృష్టి సారించాలని కోరుతున్నారు. అనుమానాస్పద కదలికలు కనిపించినప్పుడు ప్రజలు పోలీసులకు సమాచారం అందించేలా అవగాహన కల్పించాలని సూచిస్తున్నారు.

**పోలీసుల గస్తీ పెంచాలని విజ్ఞప్తి**

మండలంలో వరుసగా జరుగుతున్న దేవాలయ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో జరిగిన చోరీ ఘటనల వివరాలను పరిశీలించి, ప్రస్తుత ఘటనలతో ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో విచారణ జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ పెంచడంతో పాటు, దేవాలయాలు, ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో నిఘా బలోపేతం చేయాలని కోరుతున్నారు. అలాగే దేవాలయాల నిర్వాహకులు అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు విలువైన పూజా సామగ్రిని భద్రపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు, ఆలయ కమిటీలు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే ఇటువంటి ఘటనలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవాలయాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, చోరీ ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించాలని ఎల్కతుర్తి మండల ప్రజలు కోరుతున్నారు. తాజా ఘటనలకు సంబంధించి పోలీసుల అధికారిక ప్రకటన, పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.

# నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్

## మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీకి నూతన నియామకాలు

**మల్కాజిగిరి జనసముద్రం న్యూస్ అక్టోబర్ 23**

మేడ్చల్--మల్కాజిగిరి: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీకి నూతన నియామకాలు చేపట్టారు. జిల్లా చైర్మన్‌గా ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్ను నేషనల్ హ్యూమన్ రైట్స్ చైర్మన్ శ్రీ వరుణ్ తేజ ముదిరాజ్ నియమించి, ఐడీ కార్డును అందజేశారు.



అదేవిధంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా బాలబోయిన సోమయ్య ముదిరాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మచ్చ ఉదయ్ కుమార్ గౌడ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా దుంపల చంద్రశేఖర్ ముదిరాజ్లను నియమిస్తూ వారికి ఐడీ కార్డులను అందజేశారు.



మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తూ, ప్రజలకు న్యాయం అందేలా కృషి చేయాలని ఈ సందర్భంగా నూతన జిల్లా కమిటీ సభ్యులకు సూచించారు.

# ప్రజలకు ప్రతీ పోలీస్ జవాబుదారీ గా సేవలందించాలి డీఐజీ శ్వేతా ఐపీఎస్.

**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 23 జనసముద్రం**

మరిపెడ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్,భద్రాద్రి జోన్–×ం డీఐజీ స్వేతా ఐపీఎస్

– ప్రతి పోలీసు సిబ్బందికి స్టేషన్ రికార్డులపై పూర్తి అవగాహన ఉండాలి– గస్తీ విధుల్లో అప్రమత్తత, ప్రజా భద్రత, పోలీస్ శాఖ ప్రతిష్ఠకు ప్రాధాన్యత– సిబ్బందితో మాట్లాడి ఆరోగ్యం, వ్యక్తిగత, ఆర్థిక క్రమశిక్షణపై సూచనలు చేశారు

వరంగల్ పోలీస్ కమిషనర్, భద్రాద్రి జోన్–×ం డీఐజీ స్వేతా ఐపీఎస్ మరిపెడ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సీపీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.

అనంతరం జిల్లా ఎస్పీతో కలిసి పోలీస్ స్టేషన్‌లోని కిట్ ఆర్టికల్స్, యూనిఫాంలు, షూస్, లాఠీలు తదితర పోలీసు సామగ్రిని సీపీ పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు, ఫైళ్ల నిర్వహణ, రికార్డు షెల్ఫ్‌ల అమరికను తనిఖీ చేశారు. పరిశుభ్రత, క్రమబద్ధత, సమర్థవంతమైన నిర్వహణకు సంబంధించిన 5ూ విధానం అమలు తీరును సమీక్షించారు.

పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న క్రైమ్ రికార్డులు, అనుమానిత వ్యక్తుల షీట్లు, డ్రగ్స్ డిస్పోజల్ రికార్డులు, ప్రాపర్టీ రిజిస్టర్, గన్ లైసెన్స్ రిజిస్టర్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, పెట్టీ కేసుల రిజిస్టర్, ప్రాసెస్ రిజిస్టర్ తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి రికార్డును నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ, కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.

పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే అన్ని రికార్డులు, ఫైళ్లు, రిజిస్టర్లపై ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సీపీ స్పష్టం చేశారు. రిజిస్టర్ల నిర్వహణ విధానం, వాటిలో నమోదు చేయాల్సిన వివరాలు, కేసుల పురోగతి, రికార్డుల నవీకరణపై ప్రతి ఒక్కరూ స్పష్టమైన పరిజ్ఞానం కలిగి ఉండాలని సూచించారు. తనిఖీల



సమయంలో సంబంధిత రికార్డుల వివరాలను స్పష్టంగా వివరించేలా సిబ్బంది సిద్ధంగా ఉండాలని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారం, గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సీపీ సమీక్షించారు. సైబర్ నేరాల కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ పెట్టుబడి పథకాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో జరిగే మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురైనవారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించేలా చైతన్యం కల్పించాలని సూచించారు.

పోక్సో కేసుల్లో వేగవంతమైన, నిష్పక్షపాత దర్యాప్తు చేపట్టి బాధిత బాలబాలికలకు న్యాయం అందించాలని సీపీ తెలిపారు. బాధితుల గోప్యతను కాపాడుతూ, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ కేసుల దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలలపై నేరాల నివారణకు పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పోలీస్ శాఖ ప్రతిష్ఠ అనేది గస్తీ విధులు నిర్వహించే సిబ్బంది పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని సీపీ పేర్కొన్నారు. గస్తీ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల భద్రతకు



భరోసా కల్పించినప్పుడే పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. సిబ్బంది సమర్థవంతమైన విధుల నిర్వహణతో పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది తమకు అప్పగించిన విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహించాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ సిబ్బందితో సీపీ ముఖాముఖిగా మాట్లాడి వారి విధులు, బాధ్యతలు, సమస్యలు, సంక్షేమ అంశాలపై ఆరా తీశారు. విధుల్లో నిరంతరం బిజీగా ఉండే పోలీసులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

పోలీసు సిబ్బంది వ్యక్తిగత క్రమశిక్షణతో పాటు ఆర్థిక క్రమశిక్షణకు కూడా అలవాటు పడాలని, ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు నియంత్రించుకుంటూ పొదుపునకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సిబ్బంది కుటుంబాల భవిష్యత్తు భద్రంగా ఉండేందుకు ఆర్థిక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు.

ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందిస్తూ బాధితులకు న్యాయం అందించాలని సీపీ సూచించారు. మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పారదర్శకత, జవాబుదారీతనంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## కాళీపట్నం ఈస్ట్ రెండో స్థానం ఎంపీటీసీ అభ్యర్థిగా బాలమ్ శ్రీను నామినేషన్

**మొగల్తూరు అక్టోబర్ 23 జనసముద్రం ప్రతినిధి**



మొగల్తూరు మండలం కాళీపట్నం ఈస్ట్ రెండో స్థానం ఎంపీటీసీ అభ్యర్థిగా బాలమ్ శ్రీను నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు అనంతరం గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు, దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నామినేషన్ దాఖలు చేసిన మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

**నెల్లూరు, అక్టోబర్ 23, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**



స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కోవూరు నియోజకవర్గ శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలోనెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో, నా కుమారుడు పోలంరెడ్డి దినేష్ రెడ్డితో కలిసి ఈరోజు నెల్లూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇందుకూరుపేట మండల కూటమి జడ్పీటీసీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను దాఖలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజాసేవ పట్ల మా నిబద్ధతను చాటుతూప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలనే సంకల్పంతో నామినేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది.

## ముగిసిన ఎంపీటీసీ, జడ్పిటిసి నామినేషన్ల పర్వం

**తూర్పుగోదావరి/ సీతానగరం/ అక్టోబర్ 23/ జనసముద్రం న్యూస్:**



స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ అభ్యర్థులుగా మండలానికి సంబంధించి మూడు రోజులుగా జరిగిన నామినేషన్ల పర్వంలో 94 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరిగింది. వైఎస్ఆర్సిపి పార్టీ నుండి 49 నామినేషన్ల దాకలలో కాగా, టిడిపి పార్టీ నుండి 29, జనసేన పార్టీ నుండి 10 నామినేషన్లు, బిజెపి నుండి రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. బిఎస్పి పార్టీ నుండి ఒకటి, కాంగ్రెస్ పార్టీ నుండి ఒకటి, సిపిఐ ఎంఎల్ పార్టీ నుండి ఒకటి, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక నామినేషన్ దాఖలు కావడం జరిగినది. కూటమి తరపు ఎంపీపీ అభ్యర్థి గద్దె సత్య మాధవి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయడం జరిగినది. జిల్లా పరిషత్ వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా కరటూరి శ్రీహరిబాబు గురువారం నామినేషన్ దాఖలు చేయగా, జనసేన పార్టీకి చెందిన అభ్యర్థి బత్తుల వెంకటలక్ష్మి కూడా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అలాగే జనసేన పార్టీ నుండి గంటా స్వరూప శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. సీతానగరం జడ్పీటీసీ స్థానానికి గాను 10 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం జరిగింది.

## ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.

**పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జన సముద్రం న్యూస్ , అక్టోబర్ 23.**



పినపాక మండలం, ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, అక్కడ కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులతో వచ్చే బాధితులు, ప్రజలతో పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసులకు తెలియజేసేలా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలని,ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, సమస్య తీవ్రతను బట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులకు న్యాయం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు.

పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తూ, చట్టపరమైన ప్రక్రియలను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు.ఈ తనిఖీ ద్వారా పోలీస్ స్టేషన్ పనితీరు, నిర్మాణ పనుల పురోగతి, కేసుల పరిష్కారంపై జిల్లా ఎస్పీ దృష్టి సారించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా పోలీసు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## ముదిరాజ్ సింహ గర్జన సభ పోస్టర్ విడుదల,

**జనసముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23,2026:**



మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే ముదిరాజ్ సింహ గర్జన సభ పోస్టర్ ను, భీమారం మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక భవనంలో మంచిర్యాల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సాధనబోయిన కృష్ణ, మంచిర్యాల జిల్లా యూత్ అధ్యక్షుడు గరిగంటి సుమన్, భీమారం మండలం ముదిరాజ్ సంఘం నాయకులు సుంకరి భూమేష్ , గోస్కుల కొమురయ్య, సుంకరి మహేష్, జోడు సంపత్, సారయ్య, తిరుపతి, తో కలిసి విడుదల చేశారు, ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా నాయకులు గరిగంటి కొమురయ్య, సాధనబోయిన కృష్ణ, మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గం, అనేక రకాలుగా వెనుకబాటుకు గురవుతుందని, తమ హక్కుల సాధన కోసం పోరాడినప్పుడే హక్కులను సాధించుకోవడం జరుగుతుందని, ఈనెల 25వ తేదీన మంచిర్యాల జిల్లా కేంద్రంలో ముదిరాజ్ సింహ గర్జన సభ నిర్వహిస్తున్నట్టు, ఈ సభకు రాష్ట్ర నాయకులు వస్తున్నట్టు, కావున ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు, ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు

## అక్రమ మద్యం అమ్మకం...

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**



మద్యం బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. మండలంలోని వడ్లమన్నాడులో శుక్రవారం అక్రమంగా మద్యం అమ్ముతూ సీహెచ్ రాము అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఐదు 180ఎంఎల్ బాటిల్స్‌ను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ తెలిపారు.

## పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య

### ఒంటిమిట్టలో ప్రశాంతంగా ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్ అక్టోబర్ 23**





స్థానిక సంస్థల ఎన్నికల లో భాగంగా ఒంటిమిట్టలో ఈనెల 21 బుధవారం నుంచి 23 శుక్రవారం వరకు మూడు రోజులు పాటు ఎంపీటీసీల నామినేషన్ల పర్వం పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిశాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ , కడప జిల్లా ఎస్పీ నచికేతన్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఒంటిమిట్ట ఎంపీటీసీల నామినేషన్లు రాజంపేట డిఎస్పి వెంకటరామయ్య ఒంటిమిట్ట సిఐ వెంకటేశ్వర్లు ఎస్సై శ్రీనివాసులు ఏఎస్ ఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఎలాంటి ఘర్షణ లేకుండా స్వేచ్ఛగా ఎంపీటీసీ స్థానాలకుఅభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మొదటిరోజు బుధవారం మందకోడిగా కేవలం ఒక్క స్థానానికే నామినేషన్ వేశారు. రెండవ రోజు గురువారం 12 టిడిపి అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా ఒక ఇండిపెండెంట్ నామినేషన్ వేశారు. టిడిపి నాయకులు ప్రయత్నించినప్పటికీ పోలీసులు స్వేచ్ఛగా ఎంపీటీసీ నామినేషన్లు పకడ్బందీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఏకగ్రీవ మంత్రం విఫలమైంది దీంతో చివరి రోజు శుక్రవారం ఎక్కువ 40 నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో 9 ఎంపీటీ స్థానాలకు వైసీపీ నాయకులు టిడిపి జనసేన సిపిఎం నాయకులు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు ఎక్కువ సంఖ్యలో దాఖలు చేశారు ఎట్టకేలకు మూడు రోజులపాటు 54 మంది ఎంపీటీసీల నామినేషన్ల వేయడంతో పర్వం ఒంటిమిట్ట లో ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి

## విద్యుత్ సరఫరా పై క్షేత్రస్థాయి పరిశీలన : డిఇ జీవన్ కుమార్.

**పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జన సముద్రం న్యూస్ , అక్టోబర్ 23.**



రైతులకు నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యం అని భద్రాచలం డివిజన్ డివిజన్ ఇంజనీర్ జీవన్ కుమార్ అన్నారు. పినపాక మండలంలోని పాతరెడ్డిపాలేం,చింతల బయ్యారం ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా రైతులకు అందుతున్న విద్యుత్ సరఫరా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సరఫరాలో ఏవైనా అంతరాయాలు ఉన్నాయా, లో–వోల్టేజ్ సమస్యలు ఎదురవుతున్నాయా, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యలు,ఇతర విద్యుత్ సంబంధిత ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలపై రైతులతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, వ్యవసాయ అవసరాలకు నీటిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు రెండో పంటగా వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మణుగూరు ఏఈ పద్మారావు, పినపాక ఏఈ వేణుగోపాల్ , సబ్ ఇంజనీర్స్ లారెన్స్,వీరారెడ్డి, సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## గెలుపోటముల కంటే జీవితం ముఖ్యం : దనసరి సూర్య.

**పినపాక నియోజకవర్గం ప్రతినిధి, జన సముద్రం న్యూస్, అక్టోబర్ 23.**



కట్టం సాయి కుమార్, పసుపులేటి విశ్వనాథ్ కార్తిక్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో మణుగూరు నవీన్ బాబు టీమ్ విజేతగా నిలవగా బయ్యారం బాయ్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమానికి తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దనసరి సూర్య హాజరయ్యారు ఆయన చేతుల మీదుగా విజేతలు, రన్నరప్‌లకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సూర్య యువతకు విలువైన సందేశమిచ్చారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనా నిరాశ చెందకుండా మళ్లీ గెలిచేందుకు ప్రయత్నించాలని సూచించారు. అయితే క్షణికావేశంలో తీసుకునే తప్పుడు నిర్ణయాలు కుటుంబాలను జీవితాంతం బాధలో ముంచుతాయని హెచ్చరించారు.యువత తమ ప్రాణాలకు విలువనిస్తూ, కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గెలుపోటముల కంటే జీవితం ముఖ్యమనే సందేశంతో ఈ టోర్నమెంట్ యువతలో చైతన్యం నింపింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## 13వ వార్డు లో జరిగిన ఇంటింటి ప్రచారం

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**



మాచర్ల పట్టణంలో మాచర్ల అభివృద్ధి ప్రధాత, పల్నాటి పులి జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు మాచర్ల మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ఎనుముల కేశవరెడ్డి సతీమణి ఎనుముల సుష్మా రెడ్డి ని మరియు 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి చల్లా నాగమణి ని అఖండ మెజారిటీతో గెలిపించాలని 13 వార్డు ప్రజలతో మమేకమవుతూ, ఎన్డీఏ కూటమి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ, తమ అమూల్యమైన ఓటును తెలుగుదేశం పార్టీకి వేయాలని అభ్యర్థించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షుడు జంధ్యాల సత్యనారాయణ, వార్డు నాయకురాలు వేముల మంగమ్మ, 10వ వార్డు 68వ బూత్ ఇంచార్జ్ షేక్ జానీ భాష, మల్లెల శివ, బత్తుల చెన్న మరియు టీడీపీ,జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొనడం జరిగింది.

## 15వ వార్డు అభివృద్ధి కోసమే నా పోరాటం: టీడీపి కౌన్సిలర్ అభ్యర్థి తమ్మిశెట్టి ఏడుకొండలు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**



మాచర్ల మున్సిపాలిటీ 15వ వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ్మిశెట్టి ఏడుకొండలు వార్డు సమగ్ర అభివృద్ధి ధ్యేయంగా ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. వార్డులోని ప్రతి ఇంటికీ తిరుగుతూ, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి తనను అత్యంత భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరుతున్నారు.

వార్డును దీర్ఘకాలంగా వేధిస్తున్న మురుగునీరు సమస్యలు, వీధిలైట్ల కొరత, మరియు సురక్షిత త్రాగునీటి సమస్యలపై ఆయన ప్రత్యేకంగా స్పందించారు. "వార్డులో ఉన్న ప్రతి సమస్యను నా సొంత సమస్యగా భావించి, మీ అందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మంచి చేస్తాను" అని ఏడుకొండలు ప్రజలకు నమ్మకమైన భరోసా ఇచ్చారు. 15వ వార్డు రూపురేఖలు మారాలన్నా, మౌలిక వసతులు మెరుగుపడాలన్నా తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ్మిశెట్టి ఏడుకొండలుకు తమ పూర్తి మద్దతును ప్రకటిస్తున్నారు.

## కార్యకర్త పార్థివ దేహానికి నివాళులు, ఆర్థిక సహాయం అందజేత



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల టౌన్, అక్టోబర్ 23;**

మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో టీడీపీ కార్యకర్త కొమెర కృష్ణ ఆరోగ్యంతో మృతి చెందగా ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలియజేస్తూ మట్టి ఖర్చులకు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, 15వ వార్డు టిడిపి అభ్యర్థి తమ్మిశెట్టి ఏడుకొండలు, తిరుమల కొండ జమలయ్య, కొమెర శ్రీను దేరంగుల పెద్ద దాసరయ్య, కొమెర సాంబ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 29వ వార్డు లో జరిగిన ఇంటింటికీ ఎన్నికల ప్రచార కార్యక్రమం

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**



మాచర్ల పట్టణంలోని 29వ వార్డు లో ఇంటింటికి ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి యొనుముల సుష్మా రెడ్డి కుమారుడు అర్జున్ రెడ్డి, 29వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థి దొడ్డా అచ్చమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో మారుతీ ఆకస్మిక మృతి

**-బాధిత కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సహాయం.**
**-ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో పరామర్శ.**
**-కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ నాయకుల భరోసా.**



**కుందుర్పి, అక్టోబర్ 23, ( జనసముద్రం న్యూస్):**

కుందుర్పి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన బెస్తరపల్లి ఓబుళపతి కుమారుడు మారుతీ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం రాత్రి మారుతీ గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మారుతీ ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

మారుతీ మృతి పట్ల కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, దేవినేని ధర్మతేజ సూచనలతో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మృతుని నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని తండ్రి ఓబుళపతితో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మారుతీ కుటుంబానికి అండగా నిలిచిన టీడీపీ నాయకులు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.11 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడంలో తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుటుంబ సభ్యుడిని కోల్పోవడం తీరని లోటని, ఇటువంటి కష్ట సమయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మారుతీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జీవనం సాధ్యం





**జన సముద్రం న్యూస్ , పల్నాడు జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 23.**

మానసిక ఆరోగ్యంతోనే మెరుగైన జీవన విధానం సాధ్యమని డిస్ట్రిక్ట్ కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు అన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య నెలలో భాగంగా ముప్పాళ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు, డ్రాయింగ్ మరియు వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జ్ హెచ్.ఎం శ్రీమతి సి.హెచ్. ఉషారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పోటీ తత్వాన్ని అలవరచుకోవడం ద్వారా మానసిక దృఢత్వం పెరుగుతుందని తెలిపారు.

అనంతరం కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టడం, కష్ట సమయాల్లో ఒత్తిడిని అధిగమించడం, ఆత్మహత్యల నివారణ మరియు మంచి కెరీర్ నిర్మాణం కోసం కౌన్సిలింగ్ ప్రక్రియ, మానసిక ఆరోగ్యంపై సదస్సులు ఎంతో దోహదపడతాయని వివరించారు.

రెండు రోజుల పాటు జరిగిన ఈ అవగాహన సదస్సు, పోటీలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఇంచార్జ్ హెచ్.ఎం ఉషారాణి చేతుల మీదుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్.ఎం ఉషారాణి, కౌన్సిలర్ పి. శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 36వ వార్డు లోని ఆజాద్ నగర్, వినాయక గుట్ట లో జరిగిన ఇంటింటి ప్రచారం



**జనసముద్రంన్యూస్,మాచర్ల, పల్నాడు జిల్లా, అక్టోబర్ 23;**

మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం సందర్భంగా మాచర్ల పట్టణంలోని 36వ వార్డు అజాద్ నగర్, వినాయక గుట్ట నందు ఇంటింటికి ఎన్నికల ప్రచారం జరిగింది.ఈ ప్రచార కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొనటం జరిగిందిని మిద్దెపోగు రాజేష్, జంపుల సాయి, 36 వార్డు జనసేన అజాద్ నగర్ వినాయకగుట్ట ఇన్చార్జ్ తెలియజేశారు.

## మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరు



**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి , అక్టోబర్ 23:**

మాచర్ల మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిన్న 18, 19, 20, 21 వార్డుల్లో టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా కేశవ రెడ్డి పర్యటించారు.

వారికి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు సాదరంగా ఆహ్వానం పలికారు.

అనంతరం యాగంటి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీడీపీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా కేశవ రెడ్డితో పాటు 18వ వార్డు అభ్యర్థి మదిగపు శ్రీనివాసరెడ్డి , 19వ వార్డు అభ్యర్థి బండ్ల అనురాధ ,20వ వార్డు అభ్యర్థి పోలా సత్యం , 21వ వార్డు అభ్యర్థి కొప్పుల శివ లను సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జున రావు మాట్లాడుతూ, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని తెలిపారు. ప్రతి ఇంటికి మంచినీటి కొళాయి అందిస్తామని, ఇప్పటికే నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. త్వరలోనే బుగ్గ వాగు నుంచి మంచినీటి సరఫరా అందుతుందని, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## మోడీవారతిప్ప ఉమ్మడి ఎంపీటీసీ అభ్యర్థిగా కొల్లాటి ఉషారాణి నామినేషన్

**- పవన్ కళ్యాణ్, బొమ్మిడి నాయకర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం**
**- 200 స్ట్రైక్ రేట్‌తో గెలుపే లక్ష్యమన్న కొల్లాటి గోపి**

**మొగల్తూరు అక్టోబర్ 23**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**





మొగల్తూరు మండలం మోడీవారతిప్ప ఉమ్మడి ఎంపీటీసీ అభ్యర్థిగా కొల్లాటి ఉషారాణి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఆమె అభ్యర్థిత్వం ప్రకటించడంతో ఎన్నికల సందడి నెలకొంది.

ఈ సందర్భంగా కొల్లాటి గోపి మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామని తెలిపారు. వారి మార్గదర్శకత్వంలో ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో 200 స్ట్రైక్ రేట్‌తో గెలుపు దిశగా పయనిస్తామని కొల్లాటి గోపి ధీమా వ్యక్తం చేశారు. ప్రజల మద్దతుతో ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మోడీవారతిప్ప ఉమ్మడి ఎంపీటీసీ స్థానంలో కొల్లాటి ఉషారాణి నామినేషన్‌తో స్థానిక ఎన్నికల రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

## మాచర్ల లోని 20వ వార్డు లో జరిగిన ఇంటింటి ఎన్నికల ప్రచారం



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**

మాచర్ల పట్టణం లో జరుగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 20వ వార్డులో మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి ఎనుముల సుష్మా రెడ్డి, 20 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి పోలా చిన్న సత్యం పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇంటింటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎనుముల సుష్మా రెడ్డి ని, వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి పోలా చిన్న సత్యం ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## కుక్కునూరు జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన తరపున యర్ణం సరోజినీ నామినేషన్ దాఖలు



**కుక్కునూరు, అక్టోబర్ 23, 2026,**
**జనసముద్రం ప్రతినిధి, మణికంఠ**

జడ్పీటీసీ అభ్యర్థిగా జనసేన పార్టీ తరపున యర్ణం సరోజినీ శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం లో నామినేషన్ దాఖలు చేశారు. జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, బి జె పి పార్టీలు బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థిగా ఆమె బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంతో కుక్కునూరు జనసేన పార్టీ తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా యర్ణం సరోజినీ ఎన్నికల బరిలో నిలవడంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం ఆయన అడుగులు వేస్తున్నారు. స్థానికంగా కూడా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జనసేన కావడంతో గ్రామాల అభివృద్ధి , కనీస మౌలిక సదుపాయాలు వంటివి యర్ణం సరోజిని గెలిస్తే మండల అభివృద్ధి జరుగుతుంది అని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## మదనపల్లిలో కూటమి ధర్మానికి తూట్లు పొడిచిన టిడిపి

**- మదనపల్లిలో ఒకటి మరియు 34 వార్డులో టిడిపి మరియు జనసేన ఇరు వర్గాలు ఫోటో పోటీగా నామినేషన్ దాఖలు చేశారు.**
**- జనసేన పార్టీ అభ్యర్థులను బెదిరిస్తున్న టిడిపి నాయకులు.**



**జనసముద్రం న్యూస్, మదనపల్లి, అక్టోబర్ 23:-**

మదనపల్లి మున్సిపాలిటీ లో 1, 34 వార్డులు జనసేనకు కేటాయించగా, అయితే టిడిపి కూడా బీఫాం సమర్పించి నామినేషన్ వేయడం కూటమి ధర్మానికి తూట్లు పొడిచారు. ఒకటో వార్డు మరియు 34 వ వార్డులో జనసేన వారు నామినేషన్ వేసి ప్రచారం చేస్తున్నప్పటికీ టిడిపి నాయకులు కార్యకర్తలు జనసేన నాయకులని ప్రచారం చేయొద్దు అంటూ అడ్డుపడుతున్నారని దారం అనిత తన పార్టీ రాయలసీమ కోఆర్డినేటర్ మదనపల్లి టిడిపి నాయకులపై మండిపడ్డారు. ఇలా చేయడం కూటమి ధర్మం కాదని ఏదైనా ఉంటే టిడిపి అధిష్టానం జనసేన అధిష్టానం తో మాట్లాడుకోవాలని, స్థానికంగా మమ్మలని ప్రచారం చేయొద్దనడం బెదిరించడం సభము కాదని దారం అనిత టిడిపి నాయకులకి విజ్ఞప్తి చేశారు.

## కూటమి ఎంపీటీసీ అభ్యర్థిగా మొయ్య శివకుమార్ నామినేషన్



**జనసముద్ర న్యూస్/ ఏలూరు జిల్లా/ అక్టోబర్ 23/ద్వారకాతిరుమల**

ద్వారకాతిరుమల ఎంపీటీసీ - 1 స్థానానికి కూటమి నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా ద్వారకా తిరుమలకు చెందిన మొయ్య శివకుమార్ నామినేషన్ దాఖలు చేశారు. శుక్రవారం ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పాదుకా మండపం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయంలో మండల రిటర్నింగ్ అధికారి నిర్మల జ్యోతికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 15వ వార్డులో జరిగిన ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమం



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల టౌన్, అక్టోబర్ 23;**

మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటింటికి వెళ్లి 15వ వార్డ్ టిడిపి పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి తమ్మిశెట్టి ఏడుకొండలు ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి ఆశీర్వదించండని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల టిడిపి పార్టీ అధ్యక్షులు కొమెర దుర్గారావు, టిడిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైసీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా బుసనబోయిన విజయలక్ష్మి



**జనసముద్రం న్యూస్/ఏలూరు జిల్లా/అక్టోబర్ 23/ద్వారకా తిరుమల**

ద్వారకాతిరుమల మండలం జెడ్పీటీసీ స్థానానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దొరసానిపాడు గ్రామానికి చెందిన బుసనబోయిన విజయలక్ష్మి శుక్రవారం నాడు ఏలూరులో నామినేషన్ దాఖలు చేశారు. ఈ స్థానం జనరల్ మహిళకు కేటాయించగా, బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయలక్ష్మిని పార్టీ అధిష్టానం అభ్యర్థిగా ప్రకటించింది. ఈ మేరకు ఆమె తన నామినేషన్ పత్రాలను అధికారులకు అందజేశారు. ఆమె భర్త, వైఎస్ఆర్సీపీ దివంగత నేత సత్యనారాయణ గతంలో జెడ్పీటీసీగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారు. మండల రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన సేవలు, ప్రజలతో ఉన్న అనుబంధం నేటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని వైసీపీ నాయకులు తెలిపారు. విజయలక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించడం పట్ల ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందని మండల కన్వీనర్ ప్రతాప్ తెలిపారు.

## కార్యకర్త పార్థివ దేహానికి నివాళులు, ఆర్థిక సహాయం అందజేత



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల టౌన్, అక్టోబర్ 23;**

మాచర్ల పట్టణంలోని 15వ వార్డులో టీడీపీ కార్యకర్త కొమెర కృష్ణ ఆరోగ్యంతో మృతిచెందగా ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలియజేస్తూ మట్టి ఖర్చులకు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు మాచర్ల పట్టణ టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, 15వ వార్డు టిడిపి అభ్యర్థి తమ్మిశెట్టి ఏడుకొండలు, తిరుమల కొండ జమలయ్య, కొమెర శ్రీను దేరంగుల పెద్ద దాసరయ్య, కొమెర సాంబ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉండి జడ్పీటీసీ అభ్యర్థిగా పొత్తూరి రామరాజు నామినేషన్

**భీమవరం అక్టోబర్ 23**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

ఉండి నియోజకవర్గం, ఉండి మండలం జడ్పీటీసీ అభ్యర్థిగా నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు.

ఈ సందర్భంగా భీమవరంలో సంబంధిత అధికారులకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. జాయింట్ కలెక్టర్ (జేసీ) కల్పశ్రీకి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

ఉండి మండలం జడ్పీటీసీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేయడంతో స్థానిక



రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. నామినేషన్ ప్రక్రియలో భాగంగా సంబంధిత అధికారులకు అవసరమైన పత్రాలను



అందజేశారు. జడ్పిటిసి గా గెలిచిన అనంతరం రామరాజు జిల్లా పరిషత్ చైర్మన్ అవకాశాలు 90 శాతం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తుంది.

## భుజవలపట్నంలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే కామినేని
## 300 మందికి ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ



**జనసముద్రం న్యూస్,అక్టోబర్ 23**
**కైకలూరు నియోజకవర్గం ప్రతినిధి: పండు బాబు**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం అక్టోబర్ 23: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కామినేని శ్రీనివాసరావు శుక్రవారం కైకలూరు మండలం భుజవలపట్నం గ్రామంలో





ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.

భుజాలపట్నం గ్రామానికి చెందిన మాజీ జెడ్పిటిసి మాజీఎంపీపీసభ్యులు ముదునూరి సీతారామరాజు తన భార్య ముదునూరు లక్ష్మీదేవి జ్ఞాపకార్థం గ్రామంలోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు పేద ప్రజలకు కంటి వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా పలువురికి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించి, వైద్య సేవల ప్రాధాన్యతను వివరించారు

అనంతరం శిబిరానికి హాజరైన వారిలో 300 మందికి ఉచితంగా కళ్ళజోళ్లను పంపిణీ చేశారు

ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు

## స్థానిక సంస్థల ఎన్నికలకు పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

**నెల్లూరు, అక్టోబర్ 23: జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది కేటాయింపు కోసం ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో నిర్వహించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సాఫ్ట్‌వేర్ ద్వారా చేపట్టిన ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు.

జిల్లాలోని ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం, నెల్లూరు రూరల్, నెల్లూరు అర్బన్ ప్రాంతాల్లో మొత్తం 594 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది అవసరాలను గుర్తించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్ (పీఓ), ఒక



అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ (ఏపీఓ), ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓలు) చొప్పున మొత్తం నలుగురు సిబ్బందిని కేటాయించేలా ఏర్పాట్లు చేశారు.

ఈ మేరకు మొత్తం 594 మంది పీఓలు, 594 మంది ఏపీఓలు, 2,376 మంది ఓపీఓలు కలిపి 3,564 మంది సిబ్బంది అవసరం కాగా, 20 శాతం రిజర్వు సిబ్బందితో కలిపి మొత్తం 4,277 మందిని కేటాయించేలా ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఇందులో 713 మంది పీఓలు, 713 మంది ఏపీఓలు, 2,851 మంది ఓపీఓలు ఉన్నారు.

ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పోలింగ్ సిబ్బంది కేటాయింపు ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయ్ కుమార్, చీఫ్ ప్లానింగ్ అధికారి లక్ష్మీ నరసింహ, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ఎన్ఐసి టెక్నికల్ అధికారులు ఉన్నారు.

## భారీ వర్షాలు, తుఫాను నేపథ్యంలో మత్స్యకారులు, ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలి

- **మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు**
- **గంటకు 70 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం**
- **జిల్లా కలెక్టర్ డిమాండ్ హిమాన్షు శుక్ల**

**నెల్లూరు, అక్టోబర్ 23 : జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో అది బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 6070 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచడంతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు, ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో సూచించారు.



మత్స్యకారులు సముద్రంలోకి, నదులు, రిజర్వాయర్లలోకి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన బోట్లు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. బోట్లు, వలలు, ఇతర వేట సామగ్రిని ఎత్తైన, సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని తెలిపారు.

తుఫానుప్రభావందృష్ట్యామత్స్యకారులుఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆక్వా రైతులు చెరువుల్లో నీటి లవణీయత (సెలినిటీ), ప్రాణవాయువు స్థాయులను ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ, అవసరమైన స్థాయిలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా చెరువుల గట్లకు గండ్లు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మొగల్తూరు ఎంపీటీసీ మూడో స్థానం నుంచి ఇంజేటి లలిత కుమారి నామినేషన్
## గెలుపు అనంతరం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

**మొగల్తూరు అక్టోబర్ 23**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**

మొగల్తూరు పంచాయతీ ఎంపీటీసీ మూడో స్థానం నుంచి ఇంజేటి లలిత కుమారి నామినేషన్ దాఖలు చేశారు.

**ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ,**

ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సహకారంతో గ్రామానికి అత్యధిక నిధులు తీసుకొచ్చి, గ్రామంలో మౌలిక వసతులతో పాటు దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను



సైతం పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే సహకారంతో అవసరమైన నిధులు సమకూర్చుకుని గ్రామంలో అభివృద్ధి పనులు



చేపట్టడమే తన లక్ష్యమని లలిత కుమారి వెల్లడించారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## ఆరో వార్డు చెన్నకేశవ కాలనీలో జరిగిన ఇంటింటి ప్రచారం



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, అక్టోబర్ 23;**

మాచర్ల పట్టణంలోని ఆరో వార్డు చెన్నకేశవ కాలనీలో గురువారం ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అన్నం దాసు మేరు తోపాటు ఆలేటి వాసు, ఆరో వార్డు కి సంబంధించిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాచర్లలో లోకల్ బాడీ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా

**జన సముద్రం న్యూస్ ,పల్నాడు జిల్లా ప్రతినిధి ,అక్టోబర్ 23**

మాచర్ల : లోకల్ బాడీ ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గ పరిధిలో ఎక్సైజ్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది.

నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక రూట్ వాచ్‌లు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా, నాటుసారా తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఈ ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని పేర్కొన్నారు.





బోర్డర్ ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచడం జరిగిందని, అదేవిధంగా పాత నేరస్తులు, ఎక్సైజ్ కేసుల్లో ముద్దాయిలపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎవరైనా అక్రమ మద్యం, నాటుసారా లేదా ఏ విధమైన ఎక్సైజ్ నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన యెడల వెంటనే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని మీడియా మిత్రులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమ మద్యం, నాటుసారా నేరాలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## కుక్కునూరు మండలం లో బి. జె. పి 2వ నామినేషన్.
## గణపవరం ఎం. పి. టీ. సి స్థానంలో పోటి.



**కుక్కునూరు, ది. 23 అక్టోబర్ 2026, జనసముద్రం ప్రతినిధి.**

కుక్కునూరు మండలం లో కూటమి లో భాగం ఐనా బి. జె. పి పార్టీ కి చెందిన, పెదరావిగూడెం గ్రామానికి చెందిన మైసాక్షి లీల లావణ్య కుమారి గణపవరం ప్రదేశిక నియోజకవర్గం స్థానానికి పార్టీ తరపున పోటి చేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

H.O. Mobile : 9494184136
JANASAMUDRAM NEWS
Telugu Daily
RNI APTEL : 16151
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Published by Rajeshwari Publications
www.janasamudram.com fb/janasamudram 9494184136

# ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ

**మొగల్తూరు అక్టోబర్ 23**
**జనసముద్రం పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి**





మొగల్తూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు జరుగుతున్న ఎంపీటీసీ ఎన్నికలలో నామినేషన్ల ప్రక్రియ పూర్తయినట్లు మొగల్తూరు మండల ఎన్నికల అధికారి జి స్వాతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మూడవరోజు ఎన్నికల నామినేషన్లు పూర్తయ్యే నాటికి మొత్తం 111 నామినేషన్లు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. వానిలో శుక్రవారం 9 టిడిపి, 13 జనసేన, 17 వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, 2 బిజెపి,3 స్వతంత్ర అభ్యర్థులు వేసిన వారిలో ఉన్నారని ఆమె తెలిపారు. మూడు రోజులకు మొత్తం 25 తెలుగుదేశం 34 జనసేన పార్టీ, 45 వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, 2 బిజెపి, 5 స్వతంత్రులు నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారని స్వాతి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ఎంపీడీవో కార్యాలయాన్ని నరసాపురం డిఎస్పి కే సుధాకర్ రావు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యాలయంలో నామినేషన్లు వేసే దరఖాస్తుదారులు ప్రవేశించే మార్గాన్ని బయటకు వచ్చే మార్గాన్ని తగిన సూచనలు క్రింద స్థాయి పోలీస్ సిబ్బందికి స్పెషల్ బెటాలిన్ సిబ్బందికి అందజేశారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మొగల్తూరు ఎస్సై జి వాసు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించి ప్రజలకు ఎటువంటి కలగకుండా తగిన పర్యవేక్షణ చేపట్టారు. మైకు ద్వారా హోంగార్డు మెడగల్ఫు రామారావు అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా తగిన సూచనలు మైకు ద్వారా ఎప్పటికప్పుడు అందజేశారు. అభ్యర్థి తో పాటు మరో ఇద్దరికి మాత్రమే కార్యాలయంలోనికి అనుమతిగలదని ఎక్కువమంది నామినేషన్ల కార్యాలయంలోనికి అనుమతి లేదని పదే పదే మైకు ద్వారా ప్రజలకు చెప్పి చైతన్యపరిచారు. సాయంత్రం ఐదు గంటల దాటిన అనంతరం మండల ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ అధికారులు , ఎంపీడీవో సిహెచ్ త్రిశూలపాణి, తాసిల్దార్ అబ్దుల్ ఫరూక్ ఆదేశాలు మేరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అర్ధాంతంగా నిలిపివేశారు. శుక్రవారం విధులు నిర్వహించే ఎన్నికల సిబ్బందికి కార్యాలయం ఆరుబయట టిప్ టాప్ టెంట్ లోనికి మార్చడంతో సిబ్బంది విశాలమైన వాతావరణంలో విధులు చక చక చురుకుగా నిర్వచించగలిగారు. ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ల స్వీకరణ విధులు సక్రమంగా సకాలంలో ఇబ్బంది లేకుండా నిర్వర్తించిన స్వర్ణ గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులకు, సచివాలయ ఉద్యోగులకు మండల ఎన్నికల రిటర్నింగ్ అసిస్టెంట్ అధికారి సి.హెచ్. త్రిశూలపాణి "కృతజ్ఞతలు" తెలిపారు.

# ఒంటిమిట్ట ఎంపీటీసీ అభ్యర్థిగా ఎస్‌వీ రమణ నామినేషన్

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్:, అక్టోబర్ 23:**



ఒంటిమిట్ట మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) పదవికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలో నిలవనున్న ఆ పార్టీ నాయకుడు, ఎలక్ట్రికల్ క్లాస్-1 కాంట్రాక్టర్ ఎస్‌వీ రమణ శుక్రవారం ఒంటిమిట్ట ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.

ఒంటిమిట్ట ఎంపీపీ పదవిని బీసీ జనరల్‌కు కేటాయించడంతో, ఎంపీపీ పదవికి పోటీ చేసే ప్రక్రియలో భాగంగా ఎస్‌వీ రమణ ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఎంపీటీసీ సభ్యుడిగా ఎన్నికైన అనంతరం ఎంపీపీ పదవికి పోటీ చేసే అవకాశం ఉండటంతో ఆయన ఈ నామినేషన్ దాఖలు చేశారు.

ఎస్‌వీ రమణ నామినేషన్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు పత్తి సుబ్బరాయుడు, రేవెల్ల బాలమునయ్య బలపరిచారు. పార్టీ తరఫున ఎంపీపీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ వేయడంతో ఒంటిమిట్ట మండల పరిషత్ ఎన్నికల ప్రక్రియలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

# మండలంలో కూటమి అభ్యర్థుల ప్రకటన
## విజయమే లక్ష్యంగా పనిచేయాలని నాయకులు పిలుపు.





**తూర్పుగోదావరి/ సీతానగరం/**
**అక్టోబర్ 23/ జనసముద్రం న్యూస్ :**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి కూటమి అభ్యర్థులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ & టిడిపి జిల్లా అధ్యక్షులు మరియు రాజనగరం అసెంబ్లీ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక జీవీకే ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన మీడియా సమావేశం నందు కుటమి తరపున ఎంపీపీ అభ్యర్థిగా గద్దె సత్య మాధవిను, జడ్పిటిసి సభ్యురాలుగా బత్తుల వెంకటలక్ష్మిలు ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో 2024 ఎన్నికల స్ఫూర్తిని పునరావృతం చేస్తూ, వందశాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక విజయం సాధించాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి, సుపరిపాలన దిశగా మరో ఘనవిజయానికి నాంది పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి, ఎంపీటీసీ అభ్యర్థులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ లకు ఇంటి నివేశ స్థలాలు, సంక్షేమ నిధి సాధనే ఏపీజేఎఫ్ లక్ష్యం
## .నెల్లూరులో విజయవంతంగా ఏపీ జె ఎఫ్ జిల్లా మహాసభ



**నెల్లూరు : అక్టోబర్ 23, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**

రాష్ట్రం లోని అర్హులైన జర్నలిస్ట్ లకు అందరికీ ప్రభుత్వం ద్వారా ఇంటి నివేశ స్థలాలు సాధన,జర్నలిస్ట్ సంక్షేమ నిధి ఏర్పాటు ప్రధాన ధ్యేయం గా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫోరమ్(ఏ పి జే ఎఫ్ ) కృషి చేస్తుందని ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు పీర్ల శివ రాజేష్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు టౌన్ హాల్ ఆవరణలో ఏపీజేఎఫ్ జిల్లా మహాసభ విజయంతం గా జరిగింది. జిల్లా అధ్యక్షులు శాఖమూరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉడతా శరత్ యాదవ్ సభాధ్యక్షతన జరిగిన ఈ మహాసభ లో ఏపిజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పీర్ల శివ రాజేష్ మాట్లాడుతూ

ఏపిజేఎఫ్ అనతి కాలంలోనే జర్నలిస్ట్ ల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన లో అనేక విజయాలు సాధించిందన్నారు.

పాత్రికేయ విలువలకు పెద్ద పీట వేస్తూ భవిష్యత్ లో జర్నలిస్ట్ ల సంక్షేమం కు అవసరమైన ఆరోగ్య, కుటుంబ భద్రత కు అవసరమైన చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ద్వారా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ఇంటి నివేశ స్థలాలు తదితర విషయాలలో జర్నలిస్ట్ లకు ఇచ్చిన హామీలు నెరవేర్చి అమలు జరిగేలా ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామన్నారు.

నిబద్ధత, నిజాయితీతో కూడిన క్రమశిక్షణ కలిగిన నాయకత్వాన్ని ప్రోత్సహించేలా ఏపిజేఎఫ్ ను నిర్మాణాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేస్తున్నామన్నారు. ఫోరమ్ సీనియర్ రాష్ట్ర నాయకులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రం లో

ఏ పి జే ఎఫ్ ఆవిర్భావంతో ప్రభుత్వానికి, జర్నలిస్ట్ లకు మధ్య సానుకూల దృక్పథం తో అనేక జీవో లను సాధించడం జరిగిందన్నారు. అక్రిడేషన్ కమిటీ లలో ప్రాతినిధ్యం తో పాటు,అటాక్ కమిటీ ఏర్పాటు లో కూడా ఏపీజేఎఫ్ ముఖ్య పాత్ర కలిగి ఉండడం గర్వ కారణం అన్నారు. సంఘాలకు అతీతంగా జర్నలిస్ట్ ల సమస్యలపై ఏ.పి.ఏం.పి.ఏ. నిరంతరం పోరాడుతోందన్నారు.

ఏకగ్రీవంగా ఏపీజేఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక. జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శాఖమూరి శ్రీనివాసులు, ఉడతా శరత్ యాదవ్. ఏపీజేఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా వి. ఎస్. రామచంద్రమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులుగా సింహపురి బాబు, గౌరవ సలహాదారులుగా జయ ప్రతాప్ రెడ్డి, నన్నూరు శ్రీనివాసులు అధ్యక్షులుగా శాఖమూరి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఉడతా శరత్ యాదవ్, ఉపాధ్యక్షులుగా చేవూరు శ్రీనివాసులు, ఎస్. ప్రభావతి, పాశం సాయి రాజా లు, కార్యనిర్వాహక కార్యదర్శి కే గోపి కార్యదర్శులుగా కే. కొండయ్య, డాక్టర్ చేవూరు చిన్న, జి. హేమంత్, జెసి. శేషగిరి, అల్విన్, రమేష్, చీరల మస్తానయ్యలు సంయుక్త కార్యదర్శిగా రవీంద్ర రెడ్డి, ట్రెజరర్ గా జె. మల్లికార్జున ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బాలారావు, వెంకటేశ్వర్లు, శ్రీరస్తు శ్రీనివాసులు, రమేష్ తదితరులను నూతన కమిటీ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ప్రేక్షకులను ఆకర్షిస్తున్న నాటక ప్రదర్శనలు



**జనసముద్రం న్యూస్, మద్దిలపాలెం,,విశాఖపట్నం,అక్టోబర్24,**

రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ జాతీయ బహుభాషా నాటికోత్సవాల్లో భాగంగా కళాభారతి ఆడిటోరియం లో నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయి,, మొదటి రోజు రెండు నాటికలు ప్రదర్శించడం జరిగింది,,స్వర్గీయ టేకుల సూర్యనారాయణ గారు రచ్చించిన "రేపటి శత్రువు"నాటిక రసజ్ఞ సాంస్కృతిక సేవ సంస్థ వారిచే ప్రదర్శించబడింది,,అనంతరం నిషుంబితా స్కూల్ ఆఫ్ డ్రామా వారిచే ,, డెత్ కాల్స్ నాటిక ప్రదర్శించబడింది,, ఈ రెండు నాటికలను అధిక సంఖ్యలో ప్రేక్షకులు హాజరై తిలకించారు అని నాటక ప్రదర్శనల ఆర్గనైజర్ వేమాలి త్రినాథ్ చెప్పారు,,తొలి రోజు నాటక ప్రదర్శనకు మాజీ మంత్రి దాడి వీరభద్రారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు, బిశెట్టి రాజు,పేద విద్యాసంస్థలు అధినేత పైడ కృష్ణ ప్రసాద్,సీఎంమార్ అధినేత మావూరి వెంకట రమణ,కళా భారతీ అధ్యక్షులు యమ్మేసన్ రాజు, మాజీ ఇన్కమ్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ పి వి శేషగిరి రావు తదితరులు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు,,

# ఎంపీటీసీల నామినేషన్ల సందడే సందడి

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం**
**ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**



గుడ్లవల్లేరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి మూడవ రోజు శుక్రవారం నామినేషన్ల సందడి అధికమైంది. మండల పరిషత్ కార్యాలయంలో అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాలను మండల పరిషత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.స్వర్ణలత, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎండీ ఇమ్రాన్ స్వీకరించారు.

నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలివి:

అంగలూరు ప్రాదేశిక నియోజకవర్గం

1. చప్పిడి సుకన్య ఇండియన్ నేషనల్ కాంగ్రెస్
2. జంగం మహాలక్ష్మి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ శేరికల్వపూడి ప్రాదేశిక నియోజకవర్గం
3. నాగరాజు కొమ్ముకూరి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ, 4. ఏసు రాజు దుగ్గి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,5. కలపాల నాగరాజు తెలుగు దేశం పార్టీ
6. కాటూరి కిషోర్ బాబు తెలుగు దేశం పార్టీ
7. కొడాలి శివ కుమార్ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,పెంజెంద్ర ప్రాదేశిక నియోజకవర్గం
8. తంగిరల లక్ష్మి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ గుడ్లవల్లేరు2 ప్రాదేశిక నియోజకవర్గం,9. పంచుమర్తి నాగ లక్ష్మి తెలుగుదేశం పార్టీ,10. పంచుమర్తి నాగ కిరణ్ తెలుగుదేశం పార్టీ,11. బసి కిరణ్మయి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,12. హేమలత కుందేటి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,13. గుడ్లవల్లేటి వాణి ఇండిపెండెంటు అభ్యర్థి,గుడ్లవల్లేరు1 ప్రాదేశిక నియోజకవర్గం,14. నాగలక్ష్మి చిన్నం యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ
15. క్రాంతి చాపరాల యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,16. బాబు రాజేంద్ర ప్రసాద్ మిరియాల యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,17. పెద్దులు నిడుమోలు యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,డోకిపర్రు1 ప్రాదేశిక నియోజకవర్గం,18. గోరిపర్తి రామతులసమ్మ (అనే) రామలక్ష్మీ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ
19. గూడవల్లి లక్ష్మి ప్రసన్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ డోకిపర్రు2 ప్రాదేశిక నియోజకవర్గం,20. వేమూరి ఉదయ కుమారి యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,21. సుకీర్తి జుజ్జవరపు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్,వెణుతురుమిల్లి ప్రాదేశిక నియోజకవర్గం,22. పాగోలు కళ్యాణి జనసేన
23. పాగోలు ఝాన్సీ రాణి జనసేన,24. జుజ్జవరపు స్వప్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్,కౌతవరం1 ప్రాదేశిక నియోజకవర్గం,25. వెంకట ప్రసాద్ ఈడే యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,26. పడమట సుజాత యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,27. కొంగలేటి నాగరాజు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్,కౌతవరం2 ప్రాదేశిక నియోజకవర్గం,28. రామారావు చిన్నం యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,29. ఇనోద్ కుమార్ బేతాళ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,30. పాతకోటి రాజి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్,కూరాడ ప్రాదేశిక నియోజకవర్గం,31. చెన్నూరి ఉష రాణి జనసేన
32. కళ్యాణపు నవాబు జనసేన,33. శాలిని మొహమ్మద్ యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,శేరిదగ్గుమిల్లి ప్రాదేశిక నియోజకవర్గం,34. కాగిత వీర సంపూర్ణమ్మ తెలుగు దేశం పార్టీ,35. లక్ష్మీ పల్లెం యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,36. బెజవాడ సామ్రాజ్యం యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ,విన్నకోట ప్రాదేశిక నియోజకవర్గం
37. ఇంటూరి లావణ్య ఇండియన్ నేషనల్ కాంగ్రెస్

తరపున మండలంలోని వివిధ ఎంపీటీసీ సెగ్మెంట్ల నుంచి మొత్తం 37మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలియజేయజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు గుదే రవి, ఎంఆర్పీ, జాన్‌బెన్నీ, శాయన దుర్గాప్రసాద్, కుంచపర్తి సాయి, రంగా, గోపి తదితరులు పాల్గొన్నారు.

# నాటకీయ పరిణామాల్లో జనసేన, టీడీపీ జెడ్పీటీసీ నామినేషన్లు

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి**
**సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**



గుడ్లవల్లేరులో నాటకీయ పరిణామాల నడుమ జనసేన, టీడీపీ జెడ్పీటీసీ నామినేషను దాఖలు చేశారు. అధికారకంగా జనసేన అభ్యర్థి వర్రే బలరామకష్ణను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శుక్రవారం భారీ ఎత్తున ర్యాలీతో వెళ్లి నామినేషన్ వేయించారు. అభ్యర్థి వర్రేకు జనసేన నాయకుడు వంగవీటి రాధాకష్ణ వెన్నుదన్నుగా ఉన్నారనేది సమాచారం. ఆయన ప్రభావంతోనే ఎమ్మెల్యే వెనిగండ్ల బలరామకష్ణను జెడ్పీటీసీ అభ్యర్థిగా ప్రకటించారని ఆ పార్టీల నాయకుల్లోనే వాదనలు వినబడుతున్నాయి. వర్రేను స్వయంగా జనసేన ఎంపీ బాలశౌరి పార్టీలో చేర్చుకున్నారు. ఒక ప్రముఖ ఛానల్ ఎండీ వర్రే గంగాధర్‌కు స్వయంగా బలరామకష్ణ సోదరుడు. కాలం కలిసి వస్తే...బలరామకష్ణ జెడ్పీ ఉపాధ్యక్షులుగా అయ్యే అవకాశాలున్నాయన్న వాదనలు లేకపోలేదు.

బరిలో ఉన్నానంటూ...కొసరాజు

బలరామకష్ణతో పాటు తాను కూడా బరిలో ఉన్నానంటూ... టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్య చౌదరి కూడా ఇదే రోజు భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ వేయటం గమనార్హం. గత కొద్ది రోజులుగా కొసరాజు తన అనుయాయులతో భారీ సమావేశాలను నిర్వహించి తన సత్తాను చాటుకునే ప్రయత్నాలు చేశారు. మండలంలో 40ఏళ్లగా తమ కుటుంబానికి ఉన్న పట్టును ఈ సమావేశాలతో సాధించారు. ఎమ్మెల్యే రాము జనసేనకు జెడ్పీటీసీ అవకాశం ఇచ్చాక కూడా...కొసరాజు నామినేషన్ వేయటంతో మండలంలోనే గాక నియోజకవర్గంలో రాజకీయ వేడి రాజుకుంది. చంద్రబాబు ఒక పక్కన రెబల్స్‌కు నో ఎంట్రీ అంటూ...ప్రకటించారు. దీనితో తాను టీడీపీ తరఫునే నామినేషన్ వేశానని కొసరాజు తన అనుయాయులకు చెబుతున్నారు. పార్టీ అధిష్టానం ఎలా చెబితే...అలాగే ఎన్నికల్లో ముందుకు వెళ్తానని అంటున్నారు.

RNI:APTEL/2021/16151
జనసముద్రం న్యూస్
జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం
Telugu Daily
जनासमुद्रम न्यूस Janasamudram News జన సముద్రం న్యూస్
విలేఖరులు కావలెను
www.janasamudram.com
www.epaper.janasamudram.com
జనసముద్రం న్యూస్ పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..
సంప్రదించండి..9494184136

# గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామంలో.

## ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నేతృత్వంలో టీడీపీలోకి భారీ చేరికలు

**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**

గ్రామ పెద్దలు చావ కాళీ ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన 40 కుటుంబాలు...కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము
ఎమ్మెల్యే రాము అభివృద్ధిపై నమ్మకంతో టీడీపీలోకి వచ్చామన్న...గ్రామ పెద్దలు
నెలలో 2, 3 సార్లు గ్రామాల్లో పర్యటిస్తూ...ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ఎమ్మెల్యే రాము:స్థానిక నేతల ప్రశంసలు
పార్టీలో అందరూ సమానమే.. వ్యక్తిగత ఇష్టాలకు కాదు, ప్రజా సంక్షేమమే ప్రాతిపదిక:ఎమ్మెల్యే రాము
జనసేన అభ్యర్థుల గెలుపును కూడా టీడీపీ బాధ్యతగా తీసుకోవాలి....








గుడివాడ నియోజకవర్గంలోని గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలం చేకూరింది. గ్రామానికి చెందిన 40 కుటుంబాలు శుక్రవారం రాత్రి టీడీపీలో చేరాయి. గ్రామ పెద్ద చావ కాళీ ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కుటుంబాలకు గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావుతో కలిసి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతుగా నిలవడంతో పాటు, గుడివాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరినట్లు చావ కాళీ ప్రసాద్, నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాము నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీకి మద్దతుగా నిలిచామని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమిష్టి కృషి ఫలితంగానే గుడివాడ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా నిలిచిందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త చేస్తున్న కృషి అభినందనీయమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ఐక్యతతో ముందుకు సాగడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

"నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, నాయకులు, కార్యకర్తలతో సంప్రదింపులు జరిపిన తర్వాతే నిర్ణయిస్తున్నామన్నారు.అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనూ ఆయా గ్రామాలు, మండలాల్లోని స్థానిక నాయకత్వ అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు.క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేసే నాయకులకు అవకాశాలు కల్పించాలన్నదే మా ఉద్దేశం" అని స్పష్టం చేశారు.

కూటమిలో అంతర్గత ప్రజాస్వామ్యానికి, పరస్పర సంప్రదింపులకు ప్రాధాన్యత ఇవ్వడం మంచి పరిణామమని రాము అన్నారు. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లినప్పుడే పార్టీ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

"రాజకీయాలు మారాయి.. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారన్నారు. గతంలో పనుల కోసం నాయకుల ఇళ్ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవనీ,ఇప్పుడు ప్రజల అవసరాలను గుర్తించి, సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే మా ప్రాధాన్యతన్నారు. అభివృద్ధి అనేది ఎవరికో నచ్చిన చోట మాత్రమే జరిగే వ్యవహారం కాదనీ, ఏ గ్రామానికి ఏ పని అవసరమో, ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు ఉన్నాయో గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టాలి" అని వివరించారు.

పార్టీలో అందరూ సమానమేనని, వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు కాకుండా పార్టీ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే ప్రాతిపదికగా నిర్ణయాలు ఉంటాయని స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, న్యాయం దక్కాలన్నదే తన అభిమతమని తెలిపారు. ఒకరిద్దరు వ్యక్తుల ఇష్టానుసారం పార్టీ నడిచే పరిస్థితిని అంగీకరించబోనని, అందరితో సంప్రదింపులు జరుపుతూ సమిష్టి నిర్ణయాలతోనే ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే రాము అన్నారు. వారి నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకుని క్షేత్రస్థాయిలోనూ కూటమి పార్టీలన్నీ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

కూటమి విజయాల్లో జనసేన పార్టీ భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన అభ్యర్థుల విజయాన్ని కూడా తమ బాధ్యతగా భావించాలని సూచించారు. కూటమి పార్టీల మధ్య పరస్పర గౌరవం, సమన్వయం, సహకారం ఉన్నప్పుడే ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించగలమని అన్నారు.

"మన పార్టీ అభ్యర్థుల విజయానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, జనసేన అభ్యర్థుల విజయానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని ,కూటమిలోని ప్రతి అభ్యర్థి గెలుపు మనందరి ఉమ్మడి లక్ష్యం కావాలనీ పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల కోసం చేస్తున్న కృషిని గుర్తించి టీడీపీకి మద్దతుగా పార్టీలో చేరిన కుటుంబాలకు అభినందనలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకోవడానికి నాయకులు మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపించాలని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

కాళీ ప్రసాద్ తో పాటుగా అడుసుమిల్లి శీనుబాబు, అడుసుమిల్లు మాధవ్ దేవ్,అడుసుమిల్లి విశ్వేశ్వర్, కామినేని గంగాధర్ రావు, కాళీశెట్టి సురేష్, కాళీశెట్టి సోరయ్య, ఆత్మకూరి సురేష్, కలిశెట్టి సురేంద్ర, ఆత్మకూరి ప్రభాకర్, తదితర 40కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు.

ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పోలవరపు వెంకటరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి,కొడాలి రామరాజు,శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఈడే మోహన్, పోలవరపు,వల్లభనేని సుబ్బారావు, వలభనేని చేకూరు జగన్మోహన్రావు,దుగ్గిరాల శేషుబాబు, అట్లూరి స్వరూప్, గోవాడ శివ,జనసేన నాయకులు పేర్ని జగన్,మండలంలోని పలు గ్రామాల నేతలూ, పార్టీలోచేరినవారి కుటుంబ సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# 26వ వార్డులో జరిగిన ఎన్నికల ప్రచారం





**జనసముద్రంన్యూస్, మాచర్ల, పల్నాడు జిల్లా, అక్టోబర్ 23;**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాచర్ల పట్టణంలోని 26వ వార్డులో మాచర్ల నియోజకవర్గ నాయకులు యెనుముల కేశవరెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థి కామన బోయిన రవి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తూ తమ అమూల్యమైన ఓటును తెలుగుదేశం పార్టీ కి వేసి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# స్వర్ణకార శంఖారావం సభను విజయవంతం చేయాలి



**జనసముద్రం న్యూస్ అక్టోబర్ 23: డిండి :**

ఈనెల 24న హైదరాబాద్ లోని ఎల్బీనగర్ లో నిర్వహించే స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నల్లగొండ జిల్లా గుండ్లపల్లి డిండి మండల కేంద్రంలోని స్వర్ణకారులు కోరారు.డిండి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సభకు సంబంధించిన గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో విశ్వబ్రాహ్మణుల పాత్ర గణనీయమైనదని గుర్తు చేశారు.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సిద్ధాంతాలు,మలి దశ తొలి అమరుడు కాసోజు శ్రీకాంత్ చారి బలిదానంతో పాటు 22 మంది విశ్వబ్రాహ్మణులు ప్రాణ త్యాగం చేశారని తెలిపారు.కానీ సాధించుకున్న బంగారు తెలంగాణలో నేడు విశ్వబ్రాహ్మణుల బతుకులు బాగుపడలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి,పాలక మండలి నియమించాలని కోరారు.జీవో నెంబర్ ఎంఎస్ 272 సవరణ చేసి,అమలుపరిచి అక్రమ రికవరీలను అరికట్టాలని అన్నారు.50 సంవత్సరాలు నిండిన స్వర్ణకారులకు 5000 పెన్షన్ ఇవ్వాలని,అన్ని బ్యాంకుల అప్రైజర్లకు సీలింగ్ విధానం తొలగించి సమాంతర కమిషన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. స్వర్ణకారులందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాసుల వెంకటేష్ చారి,శ్రీరామదాసు శంకరాచారి,మహేశ్వరం శేఖర్ చారి,జగదీశ్వరాచారి, ముమ్మడి సురేష్ చారి,కాసుల శ్రీనివాస్ చారి,శ్రీరామదాసు సంతోష్ చారి,కాసుల ద్రోణాచారి తదితరులు పాల్గొన్నారు

# వెంకన్న దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు సంసిద్ధం




**జనసముద్రం న్యూస్ గుడివాడ నియోజకవర్గం ప్రతినిధి సుబ్రహ్మణ్యం. అక్టోబర్.23.**

మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం విస్తృతంగా ఏర్పాట్లను సంసిద్ధం చేస్తున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిసేకాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో మండు వేసవిలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లతో పాటు మంచినీరు, అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

# కుందుర్పమ్మకు ఘనంగా విశేష పూజలు.

- **ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు.**
- **భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన గ్రామ ప్రజలు.**
- **అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు.**
- **భక్తుల ప్రార్థనలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం.**

**కుందుర్పి, అక్టోబర్ 23 (జనసముద్రం న్యూస్):**



మండల కేంద్రమైన కుందుర్పిలో కొలువై ఉన్న గ్రామదేవత శ్రీ కుందుర్పమ్మ అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతోసర్వాంగసుందరంగాఅలంకరించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామ దేవత అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

గ్రామదేవతపై భక్తులకు అపార విశ్వాసం

కుందుర్పి గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న కుందుర్పమ్మ అమ్మవారిపై భక్తులకు అపారమైన విశ్వాసం ఉంది. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారు. తరతరాలుగా గ్రామ ప్రజలు అమ్మవారిని తమ ఇంటి ఇలవేల్పుగా భావిస్తూ పూజలు నిర్వహిస్తున్నారు.

ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న ఆలయం

విశేష పూజల సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి తమ కుటుంబాల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమ్మవారి కరుణాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపైఉండాలని భక్తులు ఆకాంక్షించారు.

# ఒంటిమిట్టలో నామినేషన్ల జాతర!

- **చివరి రోజు 40 నామినేషన్లు..**
- **టీడీపీ నుంచి 22, వైసీపీ నుంచి 7, జనసేన నుంచి 4, స్వతంత్రంగా మరో 7 నామినేషన్లు**
- **మూడు రోజుల్లో మొత్తం 54 నామినేషన్లు దాఖలు**

**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, అక్టోబర్ 23:**

మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు శుక్రవారం జోరుగా సాగింది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికల సందడి నెలకొంది. శుక్రవారం ఒక్కరోజే వివిధ పార్టీల నుంచి, స్వతంత్ర అభ్యర్థుల నుంచి మొత్తం 40 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మూడు రోజుల నామినేషన్ల ప్రక్రియలో మొత్తం 54 నామినేషన్లు నమోదయ్యాయి.

ఎన్నికల అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెలుగుదేశం పార్టీ తరఫున అత్యధికంగా 22 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఏడుగురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు సమర్పించారు. జనసేన పార్టీ తరఫున నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులుగా ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు కావడంతో అభ్యర్థులు గడువులోగా నామినేషన్ పత్రాలను సమర్పించేందుకు ఆసక్తి చూపారు.

తొలిరోజు ఒకటి.. రెండో రోజు 13

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన బుధవారం టీడీపీ తరఫున ఒక నామినేషన్ దాఖలైంది. రెండో రోజైన గురువారం టీడీపీ తరఫున 12 నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా ఒక నామినేషన్ నమోదైంది. దీంతో గురువారం మొత్తం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక మూడో రోజైన శుక్రవారం 40 నామినేషన్లు నమోదవడంతో చివరి రోజు నామినేషన్ల ప్రక్రియ మరింత సందడిగా మారింది.

మూడు రోజుల్లో 54 నామినేషన్లు

బుధవారం ఒకటి, గురువారం 13, శుక్రవారం 40 చొప్పున మూడు రోజుల్లో మొత్తం 54 నామినేషన్లు దాఖలయ్యాయి. తొలి రెండు రోజులతో పోలిస్తే చివరి రోజు నామినేషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా బరిలో నిలిచేందుకు ముందుకు రావడంతో మండలంలో స్థానిక ఎన్నికలపై ఆసక్తి పెరిగింది.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ




ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలుకు శుక్రవారంతో గడువు ముగిసింది. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. తదుపరి దశలో నామినేషన్ పత్రాల పరిశీలన, నిబంధనల ప్రకారం ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది. ఈ ప్రక్రియ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది.

నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇకపై ఆయా స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రధాన పార్టీల మధ్య పోటీ, స్థానిక రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల బలాబలాలు రాబోయే రోజుల్లో ఎన్నికల ప్రచారానికి కీలకంగా మారనున్నాయి. మూడు రోజుల నామినేషన్ల ప్రక్రియలో చివరి రోజు అత్యధికంగా



నామినేషన్లు నమోదవడంతో ఒంటిమిట్ట మండలంలో ఎన్నికల వేడి మరింత పెరిగింది.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL / 2021 / 16151 for Queries Contact us @ 94941 84136,
janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb / janasamudram